నేటి నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- సమస్యలపై వినతులు స్వీకరించనున్న అధికారులు

విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌తో మూడునెలలుగా నిలిచిపోయిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ సోమవారం ప్రారంభం కానున్నది. కలెక్టరేట్, జీవీఎంసీ, పోలీస్ కమిషనర్, జోనల్/ఆర్డీవో కార్యాలయాల్లో అధికారులు వినతులు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికగా నామకరణం చేయడంతో ఈ మేరకు బ్యానర్లు సిద్ధం చేశారు. సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించాలని అధికారులు కోరారు.

నిర్వహణ పేరిట ఇష్టారాజ్యం!

గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల తీరు

- నీటి పథకాల మరమ్మతులకు అడ్డుగోలుగా ప్రతిపాదనలు
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోచుకుంటున్నారనే ఆరోపణలు
- 2024-25లో రూ.36 కోట్ల ఖర్చుకు ప్రతిపాదన
- జడ్పీ అధికారుల ఆదేశాలతో రూ.32 కోట్లకు తగ్గింపు
- ప్రభుత్వం తాజా ఆదేశాలతో మరింత తగ్గే అవకాశం

విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి జిల్లాలోని రక్షిత నీటి పథకాల నిర్వహణలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. పథకాల నిర్వహణ, మరమ్మతుల పేరిట రూ.36 కోట్ల ఖర్చుకు ప్రతిపాదించగా, అవసరం లేకున్నా.. ఒకటికి రెండుసార్లు మరమ్మతుల పేరిట బడ్జెట్‌లో చేర్చడాన్ని జడ్పీ అధికారులు గుర్తించారు. దీంతో వ్యయాన్ని రూ.32 కోట్లకు తగ్గించారు. అయితే కొత్త ప్రభుత్వం తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు నిధుల కేటాయింపుపై పలు మార్గదర్శకాలు రూపొందించడంతో ఈ వ్యయం రూ.28 కోట్లకు పరిమితం కావచ్చునని భావిస్తున్నారు.


పాయకరావుపేటలో నిర్వహణ పనులకు ఎదురుచూస్తున్న రక్షిత నీటి పథకం ట్యాంకులు

ఉమ్మడి విశాఖ జిల్లాలోని 43 రక్షిత నీటి పథకాలను గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతి పథకం నిర్వహణకు అంటే (విద్యుత్ బిల్లులు, మరమ్మతులు, పైపులు, ఇతర పరికరాల కొనుగోలు, నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయడానికి) ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, వాచ్‌మెన్‌లు, ఫీల్డులో మరమ్మతులు చేసే టెక్నీషియన్లను నియమిస్తారు. మొత్తం 43 పథకాల నిర్వహణ కోసం టెండర్లను ఆహ్వానించి, కాంట్రాక్టర్లను ఖరారు చేస్తారు. మొత్తం వ్యయంలో మూడొంతులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తే మిగిలిన సొమ్ము జడ్పీ కేటాయిస్తుంది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచి జడ్పీకి వచ్చే వాటాలో కొంత మొత్తం ఇందుకోసం కేటాయిస్తారు.

నిధులు విడల్చని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాల నిర్వహణ నిధులను ఎప్పుడూ సక్రమంగా విడుదల చేయలేదు. దీంతో అందుబాటులో ఉన్న నిధులను కేటాయించేవారు. జడ్పీకి ఆర్థిక సంఘం నుంచి వచ్చే గ్రాంట్‌ను కూడా ఇందుకోసం వినియోగించేవారు. ఇదంతా ఒక ఎత్తైతే.. పథకాల నిర్వహణకు భారీగా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపడం గ్రామీణ నీటి సరఫరా విభాగంలో గత ఐదేళ్లుగా జరుగుతోందనే ఆరోపణలున్నాయి.

ఈ నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నీటి పథకాల నిర్వహణకు సుమారు రూ.36 కోట్లతో టెండర్లు పిలిచారు. దీనికి జడ్పీకి కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.9 కోట్లు కేటాయించారు. టెండర్ల మేరకు ఇప్పటివరకు రూ.5.5 కోట్లు నిధులు విడుదలచేసి కాంట్రాక్టర్లకు చెల్లించేశారు. మరో రూ.3.5 కోట్ల బిల్లులు మంజూరు చేసేందుకు రంగం సిద్ధమయింది. అయితే టెండర్లు, బడ్జెట్‌తో సంబంధంలేకుండా నీటిపథకాల నిర్వహణకు అంతరాయం కలగకూడదని ప్రభుత్వం ఆదేశించడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు రూ.36 కోట్లు అవసరమని ప్రతిపాదించి జడ్పీకి పంపారు.

అంచనాలపై అనుమానాలు

ఈ ప్రతిపాదనలు జడ్పీ అధికారులు పరిశీలించగా అనేక సందేహాలు తలెత్తాయి. పథకాలు ఒకటి రెండు కంటే ఎక్కువసార్లు మరమ్మతులకు గురవుతాయని ముందుగానే అంచనావేసి ఖర్చులకు ప్రతిపాదనల్లో పొందుపరిచిన విషయాన్ని గుర్తించారు. పథకం వయసును బట్టి మరమ్మతులకు నిధులు కేటాయించాల్సి ఉండగా ఎక్కువ నిధులు అవసరమని పొందుపరిచినట్టు గుర్తించి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు వివరించారు. దీంతో ముందుగా ప్రతిపాదించిన రూ.36 కోట్లను రూ.32 కోట్లకు కుదించారు. ఈ మేరకు త్వరలో టెండర్లు ఆహ్వానించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలావుండగా ప్రస్తుత ప్రభుత్వం తాగునీటి సరఫరా, ఇబ్బందులను తొలగించడంపై ప్రధానంగా దృష్టిసారించింది. తాజాగా గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో పథకాల నిర్వహణకు తీసుకోవాల్సిన మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. ఈ మేరకు పథకాల నిర్వహణ, మరమ్మతుల వ్యయం ఎలా తగ్గించాలో నిర్దేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో నీటి పథకాల నిర్వహణకు సిద్ధంచేసిన ప్రతిపాదనలు రూ.32 కోట్ల నుంచి రూ.27 కోట్లు లేదా రూ.28 కోట్లకు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. అంటే ఇప్పటివరకు ఏటా నీటి పథకాల నిర్వహణ, మరమ్మతుల కోసం భారీగా ప్రతిపాదనలు ఆమోదించి, అధికారులే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

అమర్ భవనంలో... అన్నీ ఉల్లంఘనలే!

అనుమతులు తీసుకోకుండానే నిర్మాణం

- టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పరిశీలనలో వెలుగులోకి
- ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీచేసిన అధికారులు
- అయినా పట్టించుకోని మాజీ మంత్రి
- ఫీజులు చెల్లిస్తామంటూ తాజాగా జీవీఎంసీకి ప్రతిపాదన
- భవన నిర్మాణం పూర్తయ్యాక నిబంధనలకు వ్యతిరేకమంటున్న అధికారులు
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చర్యలు!





గాజువాకలో జాతీయ రహదారి వద్ద మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ షాపింగ్‌మాల్

విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు చెందిన షాపింగ్‌మాల్ నిర్మాణం నిబంధనలకు పూర్తి విరుద్ధమేనని టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్ధారించారు. జీవీఎంసీ 70వ వార్డు పరిధి గాజువాక సమీప చట్టివానిపాలెంవద్ద జాతీయరహదారికి ఆనుకుని అమర్‌నాథ్ ఐదంతస్థుల భవనం నిర్మించారు. జీవీఎంసీ నుంచి అనుమతులు పొందకుండానే షాపింగ్‌మాల్ నిర్మించడంపై 'అమర్ అక్రమ నిర్మాణం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆదివారం ఆ భవనానికి సంబంధించిన ఫైల్‌ను పరిశీలించారు. భవన నిర్మాణం కోసం ఒక ఎల్‌టీపీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు మాత్రమే చేసుకున్నారని, ఎలాంటి ఫీజులు చెల్లించకపోవడంతో ఇంతవరకూ జీవీఎంసీ లాగిన్‌లోకి దరఖాస్తు చేరలేదని గుర్తించారు. పైగా అమర్‌నాథ్ నిర్మించిన షాపింగ్ మాల్ వద్ద జాతీయరహదారి 200 అడుగుల వెడల్పు ఉందని, భవిష్యత్తులో 266 అడుగులకు విస్తరించేలా మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచినట్టు అధికారుల పరిశీలనలో తేలింది. దీనిని బట్టి ఇంకా రోడ్డు 66 అడుగులు విస్తరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అమర్‌నాథ్ నిర్మించిన షాపింగ్‌మాల్ వైపు 33 అడుగులు రోడ్డు విస్తరణకు, తర్వాత మరో 20 అడుగులు సెట్‌బ్యాక్ కోసం వదిలి భవన నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. కానీ జాతీయరహదారికి అమర్‌నాథ్ నిర్మించిన భవనానికి 20 అడుగులు దూరం కూడా ఉండదని అధికారులు అంచనా వేశారు.

నిబంధనల ప్రకారం వ్యవహరిస్తే ప్రస్తుతం ఉన్న భవనంలో 25 నుంచి 30 అడుగుల వరకూ తొలగించాల్సి ఉంటుంది. కానీ భవనం కోసం ఇంతవరకూ జీవీఎంసీకి దరఖాస్తు చేసుకోకపోవడం, పైగా నిర్మాణం పూర్తిచేసేయడంతో ఇకపై ప్లాన్ ఇవ్వడానికి జీవీఎంసీకి కూడా సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణం జరుగుతున్నపుడే ఎలాంటి ప్లాన్ లేకుండా పనులుచేస్తున్నారని, నిలుపుదల చేయాలంటూ రెండుసార్లు నోటీసులు జారీచేసినట్టు గాజువాక జోన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. అయినా అధికారంలో ఉన్నామనే భావనతో వాటిని మాజీ మంత్రి అమర్‌నాథ్ పట్టించుకోలేదు. ఇప్పుడు 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో తాము జీవీఎంసీకి ఫీజులన్నీ కట్టేస్తామని ప్లాన్ జారీచేయాలంటూ అధికారులకు మాజీ మంత్రి విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. నిర్మాణం పూర్తయిన భవనానికి ప్లాన్ ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం కావడంతో దీనికి అధికారులు ససేమిరా అన్నట్టు తెలిసింది. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులకు నివేదించడంతో, అక్రమ భవనంపై తదుపరి చర్యలు ఎలావుంటాయనేదానిపై నగరంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

మేయర్‌కు పదవీ గండం?

మూడేళ్లు దాటితే మేయర్లు, స్థానిక సంస్థల చైర్మన్లపై అవిశ్వాసానికి వీలు

- నేటి మంత్రివర్గ సమావేశంలో చట్ట సవరణకు ఆమోదం?
- అదే జరిగితే వచ్చే కౌన్సిల్ సమావేశంలోనే అవిశ్వాస తీర్మానం
- ఇప్పటికే కూటమి నేతలతో టచ్‌లో ఉన్న వైసీపీ కార్పొరేటర్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారికి పదవీ గండం తప్పదా... వచ్చే కౌన్సిల్ సమావేశంలోనే అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉందా... అంటే రాజకీయవర్గాలనుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. స్థానిక సంస్థల చైర్మన్లపై అవిశ్వాసం పెట్టాలంటే కనీసం నాలుగేళ్ల పదవీకాలం పూర్తికావాలనే నిబంధన ఉన్న చట్టాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు సోమవారం జరిగే తొలి మంత్రి వర్గ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు, కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు. అదే జరిగితే వచ్చే కౌన్సిల్ సమావేశంలోనే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం తథ్యమని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

జీవీఎంసీకి 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ 59 వార్డులను గెలుచుకోగా, టీడీపీ 30, జనసేన మూడు, సీపీఐ, సీపీఎం, బీజేపీ నుంచి ఒక్కొక్కరు, నలుగురు ఇండిపెండెంట్లు కార్పొరేటర్లుగా విజయం సాధించారు. తర్వాత జరిగిన పరిణామాలతో ముగ్గురు టీడీపీ కార్పొరేటర్లు వైసీపీకి మద్దతు ప్రకటించారు. ఇండిపెండెంట్‌గా గెలిచిన వారిలో నలుగురు వైసీపీకి మద్దతు ప్రకటించినప్పటికీ తర్వాత ఇద్దరు జనసేనలో, ఒకరు టీడీపీలో చేరిపోయారు.

మేయర్ పదవిని దక్కించుకోవడానికి మేజిక్‌మార్క్ 50 స్థానాలు కాగా అంతకంటే ఎక్కువగా గెలుచుకున్న వైసీపీ పీఠాన్ని దక్కించుకుంది. జీవీఎంసీ 21వ వార్డు కార్పొరేటర్‌గా పోటీచేసి గెలిచిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు పదవి దక్కుతుందని సర్వత్రా ప్రచారం జరిగింది. కానీ ... మిగతా 4వ పేజీలో

సందడిగా ఒలింపిక్ డే రన్


బీచ్‌రోడ్డులో ఆదివారం ఒలింపిక్‌డే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు, ఇతర క్రీడాకారులు, ప్రముఖులు

- వార్త III పేజీలో

కేజీహెచ్‌లో ఇంజక్షన్ల కొరత

- హ్యూమన్ అల్బమిన్, ఇమ్యునో గ్లోబులిన్‌కు ఇక్కట్లు
- సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి నిలిచిన సరఫరా
- ప్రతి నెలా సుమారు వెయ్యి వరకు అవసరం
- ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.4 వేల నుంచి రూ.8 వేలు
- మార్కెట్‌లో కొనుగోలు చేయలేక రోగుల ఇబ్బందులు



విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలో రోగులకు అందించాల్సిన అత్యంత ముఖ్యమైన, ఖరీదైన ఇంజక్షన్ల కొరత వేధిస్తోంది. తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అందించే ఖరీదైన ఇంజక్షన్లు సరఫరా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆయా ఇంజక్షన్లు బహిరంగ మార్కెట్‌లో రూ.4 వేల నుంచి రూ. 8వేల వరకు ఉండడంతో కొనుగోలు చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

లివర్ ఫెయిల్యూర్, లివర్ సంబంధిత సమస్యలతోపాటు పోస్ట్ ఆపరేటివ్ కేసులకు, శరీరంలో ప్రొటీన్ పూర్తిగా తగ్గిపోయినప్పుడు ఇచ్చే హ్యూమన్ అల్బమిన్ ఇంజక్షన్ల సరఫరా మూడు వారాలుగా నిలిచిపోయింది. బయటి మార్కెట్‌లో దీని ధర రూ.4 వేల నుంచి రూ.5 వేల మధ్యలో ఉంది. ప్రతిరోజూ కనీసం పది ఇంజక్షన్లు కేజీహెచ్‌లోని వివిధ విభాగాల్లో వైద్య సేవలు పొందే రోగులకు ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని వారాల నుంచి సరఫరా లేకపోవడంతో బయట మార్కెట్‌లో కొనుగోలు చేయిస్తున్నారు. ఈ ఇంజక్షన్ ఇవ్వడం వల్ల రోగులు వేగంగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే, ఇమ్యునోగ్లోబులిన్ ఇంజక్షన్ల సరఫరా కూడా కొద్ది రోజులుగా నిలిచిపోయింది. పెరాలిస్ వచ్చిన వారికి, ఇమ్యునో మెకానిజమ్ డ్యామేజ్ అయిన వారికి, మరికొన్ని దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందేందుకు ఇది ఇస్తుంటారు. కేజీహెచ్‌లోని వివిధ విభాగాల్లో చికిత్స పొందే ఎనిమిది మంది రోగులకు ప్రతిరోజూ ఈ ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో దీని ధర రూ.ఐదు వేలు నుంచి ఎనిమిది వేలు మధ్యలో ఉంది. నెల రోజులుగా సరఫరా నిలిచిపోవడంతో రోగుల బంధువులు బయట కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. కేజీహెచ్‌కు అవసరమైన మందులు, ఇంజక్షన్లు కావాలని ఆస్పత్రి అధికారులు ఇండెంట్ పెడుతుంటారు. అందుకు అనుగుణంగా సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి సరఫరా చేయాలి. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో ఈ మందులు అందుబాటులో లేకపోవడంతో సరఫరా చేయడం లేదు. హెచ్‌డీఎస్ నిధుల నుంచి కొనుగోలు చేసే అవకాశమున్నా కేజీహెచ్ అధికారులు పట్టించుకోవడంలేదు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

కలెక్టర్ పోస్టుకు పైరవీలు

- విశాఖ వచ్చేందుకు పలువురి ఆసక్తి
- తీవ్రంగా యత్నిస్తున్న ప్రసన్న వెంకటేశ్, విజయకృష్ణన్, హరీంద్రప్రసాద్, హరినారాయణన్
- చివరి వరకు ప్రయత్నించి విఫలమైన సృజన



విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టేందుకు పలువురు ఐఏఎస్ అధికారులు పోటీపడుతున్నారు. ప్రస్తుత కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. సరికదా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా పనిచేయాలని ప్రతి ఐఏఎస్ అధికారి కోరుకుంటారు. ఈ నేపథ్యంలో పలువురు పోటీ పడుతున్నారు. దీంతో ప్రభుత్వం వడపోత ప్రారంభించింది. అంతేకాకుండా నగరానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్‌లకు పలువురి పేర్లు సూచించారన్న ప్రచారమూ సాగుతోంది.

ఏలూరు కలెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన ప్రసన్న వెంకటేశ్ విశాఖ రావడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారని చెబుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా శనివారం పోస్టింగ్ వచ్చిన దినేష్‌కుమార్ సతీమణి విజయ కృష్ణన్ (ప్రస్తుతం మహిళా ... మిగతా 4వ పేజీలో

నేడు ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌కు చార్జి అప్పగిస్తారని ముందుగా నిర్ణయించారు. అయితే ఈ కార్యక్రమం వాయిదా పడింది. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్‌గా మయూర్ అశోక్ బాధ్యతలు స్వీకరించనున్నారు. వెంటనే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు.


మయూర్ అశోక్

ఒకేసారి రెండు పరీక్షలు!

- ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల తీరిది
- జూలై 31, ఆగస్టు ఒకటి, రెండు, మూడు తేదీల్లో బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు
- జూలై 30 నుంచి ఆగస్టు 8 మధ్య ఎమ్మెస్సీ దూర విద్య ఎగ్జామ్స్
- రెండింటికీ ఎలా హాజరుకావాలో తెలియక అయోమయంలో విద్యార్థులు



విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల తీరు ఎప్పుడూ వివాదాస్పదంగానే ఉంటోంది. గత ఐదేళ్లుగా వారు తీసుకున్న అనేక నిర్ణయాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తాజాగా విడుదల చేసిన పరీక్షల షెడ్యూల్‌తో వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఒకేసారి రెండు పరీక్షలకు హాజరుకావాల్సిన పరిస్థితిని కల్పించాయి. దీంతో ఏంచేయాలో తెలియక వారంతా తలలుపట్టుకుంటున్నారు. అధికారుల నిర్వాకంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీఈడీ, దూర విద్యలో ఎమ్మెస్సీ పరీక్షలను వచ్చే నెల 31 నుంచి ఆగస్టు ఎనిమిదో తేదీల మధ్య నిర్వహించేలా ఏయూ అధికారులు తాజాగా షెడ్యూల్ విడుదల చేశారు. ఇదే విద్యార్థులకు శాపంలా పరిణమించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) 2022లో ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం విద్యార్థులు ఒకేసారి రెగ్యులర్ కోర్సు, దూరవిద్యలో మరోకోర్సును పూర్తిచేసుకునే అవకాశం ఉంది. దీంతో ఎంతోమంది విద్యార్థులు రెండు విభిన్నమైన కోర్సులను ఒకేసారి పూర్తిచేస్తున్నారు. ఇదే ఇప్పుడు ఇబ్బందులకు కారణమయింది.

ఏయూ పరిధిలో సుమారు 1500 మంది విద్యార్థులు బీఈడీ కోర్సు చేస్తూనే, దూర విద్యలో ఎమ్మెస్సీ చదువుతున్నారు. వీరికి ఒకేసారి పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదల వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జూలై 31 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు బీఈడీ ... మిగతా 4వ పేజీలో

అస్తవ్యస్తంగా కాలువ నిర్మాణం

» వరద నీటి ముంపు నిరోధానికి రూ. 38 లక్షలతో డక్ట్ నిర్మాణం » పనుల తీరుపై స్థానికుల అసంతృప్తి » పెన్సింగ్ తొలగింపు


కొత్తగా నిర్మించిన కాలువ దుస్థితి


తీసి పడేసిన పెన్సింగ్

మురళీనగర్, జూన్ 23; గ్రేటరు 51వవార్డులో ఎన్నికల కోడ్ వెలువడక ముందు వైసీపీ నాయకులు ఆదరాబాదరాగా కొత్త నిర్మాణాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. వీటిలో భాగంగా రూ.39 లక్షలతో పోలీసు స్టేషన్ ఎదుట, ఆర్అండ్‌బీ ఆఫీసు వద్ద కాలువపై డెక్టుల నిర్మాణం చేపడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వానాకాలంలో వచ్చే వరద నీటి ముంపు సమస్యకు పరిష్కారంగా ఈ పనులు చేస్తున్నారు. త్రికోణ ఆకారంలో నిర్మించి ఈ డెక్ట్ పనులు దాదాపు తుది దశకు చేరాయి. అయితే, ముందు చూపుతో ఈ నిర్మాణం విషయంలో కనీసం జాగ్రత్తలు పాటించడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ఈ పనుల లక్ష్యం ఏ మేరకు నెరవేరుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీఏ కార్యాలయం మలుపు నుంచి ఎయిర్‌పోర్టు జోన్ పోలీసుస్టేషను వరకు రోడ్డను ఆనుకొని చేపట్టిన డెక్టు కట్టడం వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి భద్రతా కల్పించచడంలేదు. దీంతోపాటు జీ-20 సదస్సుల సమయంలో ఈ రోడ్డులో వేసిన పెన్సింగ్‌ను ఈ పనుల కోసమని తీసేసి పక్కన పడేశారు. పచ్చదనం పెంపు అంటూ అక్కడి దుకాణాలను కూడా ఆఘమేఘాల మీద తొలగించారు. గానీ, నిర్వహణ శూన్యం. పచ్చదనం జాడే లేదు. చేపడుతున్న పనుల వల్ల డెక్టుల్లో ఓ వైపు మాత్రమే మురుగు నీరు పారే అవకాశం ఉంది. పోలీసు స్టేషను వైపు నిర్మించిన డెక్టు వృధాగా మారింది. ఇక్కడ మురుగునీటి పారుదలకు ఎగువ నివాసిత ప్రాంతాల నుంచి గానీ, ఆర్అండ్‌బీ కార్యాలయం, పోలీసు స్టేషను పరిసరాలు, ఉడాకాలనీ నివాసాల నుంచి అనుసంధానం కల్పించ లేదు. దీంతో ప్రస్తుతం చేపట్టిన పనులతో ఏ మేరకు ప్రయోజనం ఉందో తెలియకున్నా, ఇక్కడి ఫెన్సింగ్‌ను మా త్రం తొలగించారు. దీంతో వరద నీటి నిర్వహణ ఏ మేరకు గాడిన పెడతారో ప్రశ్నార్థకంగా మారింది.


అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు పుష్పగుచ్ఛమిస్తున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి: అసెంబ్లీ స్పీకరుగా ఎంపికైన చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఆదివారం విజయవాడలో టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.

సంగీతానికి ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం..


సంగీత కళాకారుడు ఆకొండ వెంకటరావును సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, జూన్ 23: సంగీతానికి ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఐవీఎల్ శ్రాస్తి సంగీత సమితి కార్యాలయ ప్రాంగణంలో శృతిలయ, మెలోడి క్రియేటర్స్, రసరాగా మాధురి సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కులపతి ఐవీఎల్ శ్రాస్తి స్థాపించిన సంగీత జనకులం ద్వారా గత 23 ఏళ్లపైగా శాస్త్రీయ సంగీతానికి నిస్వార్థమైన సేవలందిస్తున్న బ్రహ్మశ్రీ ఆకొండ వెంకటరావును ప్రముఖ న్యాయవాది ఎంబర్ మన్నార్ దేవస్థానం మాజీ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా సత్కరించి అభినందించారు. ఉచితంగా సంగీత శిక్షణ ఇస్తూ ఎంతో మందిని తీర్చిదిద్దారని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొణతాల రాజు, ఆధ్యాత్మికవేత్త ఎం.రాజశేఖర్, వి.ప్రభాకర్, సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎం.ఎస్.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'కూన'కు సాదర స్వాగతం


మాధవధారలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

మురళీనగర్, జూన్ 23 ; తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన.రవికుమార్‌కి ఆదివారం విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు సాదర స్వాగతం పలికారు. శాసన సభ్యునిగా ప్రమాణ స్వీకారం తర్వాత మొదటిసారి విశాఖ ఎయిర్‌పోర్టుకి చేరుకున్న ఆయనకు నాయకులు స్వాగతం పలికారు. కళింగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే కావడంతో, మాధవధారలో ఉన్న ఆ వర్గ నాయకులు, విశాఖ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి తదితరులు ఎమ్మెల్యేని బిర్లా జంక్షన్‌కు ఆహ్వానించి గజమాలతో సత్కరించారు. అనంతరం బిర్లా జంక్షన్‌లో ఉన్న టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి రవికుమార్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పృథ్వీరాజ్, సనపల.నరసింహ, పార్టీ నాయకులు, అభిమానులు ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం


అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూన్ 23: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము ఆరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. విశాఖ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తెల్లవారుజాము నుం చే భక్తుల రాక ఆరంభమైంది. దీంతో ఆలయానికి వచ్చే మార్గాలు సందడిగా మారాయి. పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించి అంతా మొ క్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పలువురు భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ పి.పైడపునాయుడు ఆధ్వ ర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఎంపీ శ్రీభరత్‌కు అభినందన


శ్రీభరత్‌కు జ్ఞాపిక అందిసున్న జోగా మహేష్ తదితరులు

కంచరపాలెం, జూన్ 23 : విశాఖ ఎంపీగా గెలుపొందిన ఎం. శ్రీ భరత్‌ను జీవీఎంసీ 55, 46 వార్డులకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఆదివారం కలిసి అభినందించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జోగా మహేష్ ఆధ్వర్యంలో నాయకులు వెంకటేశ్వరరావు. బింగిరాజు రెడ్డి, నరసింగరావు తదితరులు భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఫొటో ఉన్న జ్ఞాపికగా అందజేశారు. నగరాభివృద్ధిలో తమ వంతు కృషి చేస్తామని నాయకులు ఎంపీకు వివరించారు.

పోర్టు స్టేడియంలో ఉచిత ప్రవేశంపై హర్షం

అక్కయ్యపాలెం, జూన్ 23: పోర్టు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లకు పోర్టు మైదానంలో ఉచిత ప్రవేశం కల్పించేందుకు మైదానం అధినేత కాశీ అంగీకరించడంపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం నిర్వాహకుడితో తాము చర్చించామని, వెంటనే సానుకూలంగా స్పందించారని చెప్పారు. అలాగే, ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా అభినందనలు దేముడు తెలిపారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన పి.విష్ణుకుమార్‌రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంక్షేమం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వరంగ సంస్థలు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా చూడాలని కోరారు.

ఫ్యాషన్ షో అదరహో


ర్యాంప్ వాక్ చేస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు

మహరాణిపేట, జూన్ 23: సాగర తీరాన అతివలు అందాలతో అదరహో అనిపించారు. ఆదివారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని హోటల్ నోవాటెల్‌లో జేడీ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థ వార్షిక ఫ్యాషన్ డిజైన్ అవార్డుల వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు అభ్యసిస్తున్న బెంగళూర్, హైదరాబాద్ తదితర నగరాలకు చెందిన విద్యార్థులు తాము డిజైన్ చేసిన విభిన్న రకాల దుస్తులను ధరించి వేదికపై ర్యాంప్ వాక్, క్యాట్ వాక్ చేసిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. సుమారు 30 మందికి పైగా విద్యార్థినులు సుమారు 300 పైగా డిజైన్ చేసిన దుస్తులతో ఏడు రౌండ్ల ఫ్యాషన్ షోలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని తొలుత ప్రారంభించారు. షోలో ప్రతిభ చూపిన ఐదుగురికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాండెక్స్ అధినేత దొరస్వామి రాజు, కట్టమూరి ప్రదీప్, రేస్ సంస్థ దాడి రవికుమార్, ప్రసన్నకుమార, ప్రసాదరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

త్రిశక్తి వైభవంపై ప్రవచనం

అక్కయ్యపాలెం, జూన్ 23: గురుదేవుల ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితా పీఠంలో శ్రీ శక్తి పీఠాధిపతి మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతీ స్వామిని ఆదివారం రాత్రి వాదీశ్వరి రూపంపై ప్రవచనం చేశారు. లలితాదేవికి సంబంధించిన రూపాల్లో వశీన్యది వాగ్దేవతలు లలిత సహస్రనామాలు నిర్వహించిన వారు. వీళ్ల శక్తిని అనుగ్రహిస్తారని వివరించారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ స్వామి సమక్షంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణ సేన్ పర్యవేక్షించారు.

ఘంటసాల తెలుగు జాతికి వరం

సీతంపేట, జూన్ 23: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘంటసాల ఆరాధనోత్సవం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు సయ్యద్ రహమతుల్లా నిర్వహణలో జరిగిన ఈ వేడుకలో ఘంటసాల పాటలను గాయనీగాయకులు గానం చేశారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా మేడా మస్తాన్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ జి.మహేష్, డాక్టర్ జీవీ రావు, కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు. ఘంటసాల గానం ఎన్ని తరాలైనా మరిచిపోలేని అనుభూతినిస్తాయన్నారు. తెలుగు చి త్ర పరి శ్రమకు ఆయన ఓ వరమని కొనియాడారు.

సినీ రంగానికి బాల సుబ్రహ్మణ్యం సేవలు చిరస్మరణీయం

అక్కయ్యపాలెం, జూన్ 23 : ప్రముఖ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం చలన చిత్ర రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని సినీ నిర్మాత, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. బాల సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఘంటసాల స్వోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సంగం ఆఫీస్ జంక్షన్‌లోని స్వరాలయ రికార్డింగ్ స్టూడియోలో నిర్వహించిన ఎస్పీ సినీ సంగీత విభావరిని ఆయన ప్రా రంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాయకునిగా, నటుడుగా, సంగీత దర్శకుడిగా, స్టూడియో అధినేతగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా బాలు సినీరంగానికి విశేష సేవలందించారని ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, ఆధ్యాత్మికవేత్త ఎస్.ఫణిస్వామి, మా జీ ఏడీసీపీ మహ్మద్ ఖాన్, ఉపాధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ పాల్గొన్నారు.


ఘంటసాల ఆరాధానోత్సవంలో రచయితలు, కవులు తదితరులు

కంచరపాలెం సీఐగా సీహెచ్ ప్రసాద్


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్

కంచరపాలెం, జూన్ 23 : కంచరపాలెం పోలీస్ స్టేషన్ శాంతిభద్రతల విభాగం సీఐగా సీహెచ్.ప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.ప్రస్తుతం ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న సీఐ ఎస్.భాస్కరరావు అనారోగ్యంతో సెలవులో ఉండడంతో ఆయన స్థానంలో ప్రసాద్‌ను సీఐగా సీపీ రవిశంకర్ నియమించారు. ప్రసాద్ నగరంలో గాజువాక, మూడు, నాలుగో పట్టణ స్టేషన్‌లలో గతంలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ప్రసాద్ ఇక్కడికి వచ్చారు.ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతు శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సిబ్బందితో కలిసి కృషి చేస్తానని అన్నారు.

పాత చలానాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్


తనిఖీలు చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

జగదాంబ కూడలి, జూన్ 23: టూవీలర్స్ నుంచి పాత చలానాల వసూలుకు నగర ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆదివారం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ గుడి, బ్యారెక్స్ మెయిన్ రో డ్డు, జగదాంబ, లేపాక్షి వద్ద ఈ మేరకు తనిఖీ చేపట్టారు. సిటీలో షాపింగ్, మా ర్కెట్ పనులపై వచ్చిన వాహనాలను నిలిపి చలానా వసూలు చేయడంపై వాహనదారులు అసహనం వ్యక్తంచేశారు. కుటుంబాలతో ఆదివారం సరదాగా వచ్చిన వారు ట్రాఫిక్ పోలీసులు తనిఖీలతో ఆందోళన వ్యక్తంచేశారు. చలానాల పెండింగ్ వాహనాలకు సంబంధించి పత్రాలు, నంబర్ ప్లేట్‌లను తనిఖీ చేసి జరిమానాలు విధించారు. లేపాక్షి వద్ద ట్రాఫిక్ సర్కిల్ వద్ద వాహన రాకపోకలను గాలికి వదిలేసి టూవీలర్స్‌ను అడ్డుకోవడం విమర్శలు తలెత్తాయి.

విజ్ఞాన భాండాగారం పీవీ నరసింహారావు


మాట్లాడుతున్న పీవీ తనయుడు ప్రభాకరరావు

మహరాణిపేట, జూన్ 23: మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు ఓ విజ్ఞాన భాండాగారమని ఆయన తనయుడు పీవీ ప్రభాకరరావు అన్నారు. ఆదివారం మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న పీవీ నరసింరావు 104వ జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో జడ్పీ జంక్షన్‌లోని అంకోశా సమావేశమందిరంలో అభినందన సభ నిర్వహించారు.. ముందుగా పీవీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీవీ పదహారు అణాల తెలుగువారని, విషయ పరిజ్ఞానంలో జ్ఞాన పిపాసీ అని కొని యాడారు. తన చిన్నతనంనుంచి బానిస మనస్తత్వం నచ్చేదికాదని, నిజాం నవా బులు వందేమాతరం గీతాన్ని నిషేధించడాన్ని ఆయన వ్యతిరేకించారని తెలిపారు , దేశంలో విద్య, ఆర్థిక, భూ సంస్కరణలు తీసుకువచ్చిన మేధావి అని అన్నారు. పీవీకి విశాఖనగరం అంటే ఎంతో ఇష్టమని, ఆయనకు రాష్ట్రంలో తొలిసారి విగ్రహానికి ఇక్కడే ఆవిష్కరించారన్నారు. ఈ సమావేశంలో ప్రముఖులు ప్రసన్న కుమార్, డాక్టర్ రఘురామారావు పాల్గొన్నారు.

జోరుగా ఫుట్‌పాత్ వ్యాపారాలు

జగదాంబ కూడలి, జూన్ 23: పూర్ణామార్కెట్ సమీపంలో ఆంజనేయ స్వామి గుడి మెయిన్ రోడ్డు విస్తరణతో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ వ్యాపారాలు ఆదివారం కావడంతో జోరుగా సాగాయి. పూర్ణా థియేటర్ మెయిన్ రోడ్డును వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు జరిపారు. దీంతోట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి.


రోడ్డుపై వ్యాపారం సాగిస్తున్న దృశ్యం

ఆంధ్ర సీనియర్ క్రికెట్ జట్టు కోచ్‌గా టిను యోహానన్


టిను యోహానన్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 23: ఆంధ్ర సీనియర్ పురుషుల జట్టుకు భారత మాజీ క్రికెటర్ టిను యోహానన్ ప్రధాన కోచ్‌గా నియమితులయ్యారు. 2024-25 సీజన్‌కుగాను పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా ఆయన వ్యవహరించనున్నారు. కేరళకు చెందిన యోహానన్ 2001-2002లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లలో మూడు మ్యాచ్‌లు.. 2002లో వెస్టిండీస్, శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లలో మూడు మ్యాచ్‌ల్లో భారత్ సీనియర్ క్రికెట్ జట్టుకు ఆడారు. ఇక, అండర్-23 పురుషుల జట్టుకు జె.కృష్ణారావు, సీనియర్ మహిళల జట్టుకు ఎంఎస్.విక్రమ్‌వర్మ, అండర్-23 మహిళల జట్టుకు ఎస్. రమాదేవిలను ప్రధాన కోచ్‌లుగా నియమితులయ్యారు. మహిళల అండర్-19 విభాగానికి ఎస్. శ్రీనివాసరెడ్డి, అండర్-15 విభాగానికి ఎం.సవిత ప్రధాన కోచ్‌లుగా వ్యవహరించనున్నారు. సీనియర్ పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా నియమితులైన యోహానన్‌తోపాటు వివిధ విభాగాలకు ప్రధాన కోచ్‌లుగా నియమితులైన వారి శిక్షణలో ఆంధ్ర జట్లు మంచి ఫలితాలు సాధిస్తాయని ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు శరత్ చంద్రారెడ్డి, ఎస్ఆర్.గోపీనాథరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

టమాటా కోసం బారులు తీరిన జనం


నరసింహనగర్ రైతుబజారులో కొనుగోలుదారుల క్యూ

అక్కయ్యపాలెం, జూన్ 23: టమాటా ధర రోజురోజుకు పెరిగి ఆకాశాన్నంటుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినడంతో వాటి దిగుబడి తగ్గింది. దీంతో టమాటాకు గిరాకీ పెరిగింది. రైతుబజార్లలో టమాటా ధరను వ్యాపారులు పెంచారు. దీంతో రైతు బజారులో టమాటా కిలో రూ.66కి చేరింది. అయినా, వినియోగదారులు క్యూలో నిల్చొని కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లలో కిలో రూ.90 నుంచి రూ.110 వరకు విక్రయిస్తున్నారు. ఎక్కువ శాతం టమాటా మదనపల్లె నుంచి దిగుమతి అవుతుంది. అక్కడి నుంచి కూడా దిగుమతి తక్కువగా రావడంతో వ్యాపారులు సతమతమవుతున్నారు. రైతుబజార్లలో తప్పని సరై డ్వాక్రా సంఘాల సభ్యులు విక్రయిస్తున్నారు. నరసింహనగర్ రైతుబజారులో టమాటా కోసం వినియోగదారులు ఆదివారం ఉదయం నుంచి బారులు తీరారు. వారం రోజులోనే టమాటా ధర ఎక్కువగా పెరిగింది. రానున్న రోజుల్లో మరింతగా పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి టమాటను సబ్సిడీ ద్వారా విక్రయించాలని వినియోగదారులు కోరుతున్నారు.

'హత్యాచార ఘటన దురదృష్టకరం'


మాట్లాడుతున్న ఈతలపాక సుజాత

మహారాణిపేట, జూన్ 23: బాపట్ల జిల్లాలో యువతి హత్యాచార సంఘటన దురదృష్టకరమని తెలు గు దేశం పార్టీ అధికార ప్రతి నిధి ఈతలపాక సుజాత ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఘటనపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తక్షణం స్పందించి హోం మంత్రి అనితకు ఆదేశాలు ఇవ్వటంతో ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరపున రూ.10 లక్షలఎక్స్‌గ్రేషియా అందించినట్టు చెప్పారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వైసీపీ ప్రభుత్వం జగన్‌మోహన్ రెడ్డి స్పందించిన పాపాన పోలేదని అన్నారు. త మది ప్రజా ప్రభుత్వం... ప్రజల పక్షాన నిలిచే ప్రభుత్వం కావడంతో హత్యాచార బాధితురాలి కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గనగళ్ల సత్యవతి, దక్షిణ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కేదారి లక్ష్మి, నార్త్ అధ్యక్షురాలు తోట శ్రీదేవి పాల్గొన్నారు.

మేయర్‌కు పదవీ గండం?

... 3వ పేజీ తరువాయి

అనూహ్యంగా ఆయనను పక్కనపెట్టి 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారిని వైసీపీ అధిష్ఠానం మేయర్‌గా ప్రకటించింది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జీవీఎంసీ పరిధిలోని ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో చాలామంది వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చేరిపోయేందుకు సిద్ధపడుతున్నారు. ఇందులో భాగంగా తమకు పరిచయమున్న నేతల ద్వారా తమ ఆసక్తిని వ్యక్తంచేస్తున్నారు. దీంతో మేయర్‌ను మార్చేయాలని కూటమి నేతలు నిర్ణయించారు. ఇందుకు అవిశ్వాస తీర్మానం పెట్టాలి. కానీ చట్ట ప్రకారం స్థానిక సంస్థల పదవీకాలం కనీసం నాలుగేళ్లు పూర్తైతేనే అందుకు అవకాశం ఉంటుంది. జీవీఎంసీకి ఎన్నికలు జరిగి మూడున్నర సంవత్సరాలు కూడా పూర్తికాకపోవడంతో వీలుకాదు.

జీవీఎంసీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, స్థానిక సంస్థల్లో వైసీపీకి చెందినవారే మేయర్లు, చైర్మన్లుగా ఉన్నారు. వారందరినీ దింపి కూటమి నేతలను పదవిలో కూర్చోబెట్టాలంటే చట్టసవరణ తప్పనిసరికావడంతో ప్రభుత్వంలోని పెద్దలు ఆదిశగా ఆలోచన చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా అవిశ్వాసానికి మూడేళ్ల కనీస పదవీకాలం సరిపోతుందని మంత్రి మండలి ఆమోదించి, ఆ తర్వాత గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ జారీచేయించే అవకాశం ఉందని రాజకీయవర్గాలతోపాటు జీవీఎంసీలోని కొంతమంది అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర మంత్రి మండలి తొలి సమావేశం సోమవారం జరుగుతున్నందున ఈ అంశాన్ని కూడా అజెండాలో చేర్చినట్టు ప్రచారం జరుగుతోంది. అది జరిగితే మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానానికి అడ్డంకులు తొలగినట్టేనని భావిస్తున్నారు.

కలెక్టర్ పోస్టుకు పైరవీలు

... 3వ పేజీ తరువాయి

సంక్షేమశాఖలో పనిచేస్తున్నారు) పేరును కొందరు నేతలు ప్రభుత్వానికి సూచించారంటున్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయంలో అడిషినల్ సీఈవోగా ఉన్న ఎంఎన్ హరీంద్రప్రసాద్ పేరుకూడా ప్రముఖంగా వినిపిస్తోంది. ఇంకా నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న హరినారాయణన్ పేరును కొందరు నేతలు సూచించారని సమాచారం. వీరితో పాటు కర్నూలు నుంచి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన జి.సృజన తీవ్రంగా ప్రయత్నించారని సమాచారం. ఈమె గతంలో విశాఖ జాయింట్ కలెక్టర్‌గా, జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేశారు. ఆమెకు విశాఖ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చేందుకు పూర్తిస్థాయిలో నిర్ణయం జరిగిందని, అయితే టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఉన్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు అప్రమత్తమై మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి అభ్యంతరం వ్యక్తంచేశారని తెలిసింది. వైసీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సృజన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆదేశాలతో గాజువాకలో పల్లా వాణిజ్య కాంప్లెక్స్‌ను కూల్చివేశారు. దీనిపై ఆయన హైకోర్టులో దాఖలుచేసిన కేసులో జీవీఎంసీ కమిషనర్‌గా సృజన పేరు చేర్చారు. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉంది. కాగా గీతం భవనాలను కూల్చివేయడం, భీమిలిలో గంటా శ్రీనివాసరావుకు చెందిన టీడీపీ కార్యాలయం భవనం కూల్చివేతకు ప్రయత్నించడం అప్పట్లో వివాదాస్పదమైంది. ఈ విషయాలను మంత్రి లోకేశ్‌కు నేతలిద్దరూ వివరించారని తెలిసింది. దీంతో పాటు సృజన జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో నగరపాలక సంస్థ ఎన్నికలపై టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఆమెను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చినట్టు సమాచారం.

ఒకేసారి రెండు పరీక్షలు!

... 3వ పేజీ తరువాయి

నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. అదే సమయంలో దూరవిద్యలో ఎమ్మెస్సీ బోటనీ, ఫిజిక్స్, జువాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, మ్యాథ మెటిక్స్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు జూలై 31 నుంచి ఆగస్టు ఎనిమిదో తేదీ వరకు పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో ఈ రెండు కోర్సుల్లో చేరిన వందలాది మంది విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. బీఈడీ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్ష జరగనుండగా, ఎమ్మెస్సీ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఒకేసారి రెండు పరీక్షలకు ఎలా హాజరవుతామని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి షెడ్యూల్ మార్చాలని కోరుతున్నారు. కాగా ఈ అంశాన్ని ఇప్పటికే పలువురు ఏయూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కనిపించలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, తదితరులు

గ్రీన్‌సిటీ శ్రీవారి ఆలయంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పూజలు

కూర్మన్నపాలెం, జూన్ 23: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీని ఆదివారం ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సందర్శించారు. అనంతరం ఆమె శ్రీవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తొలుత వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు ఇరగవరపు వాసుస్వామి పూర్ణ కుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. పూజలు అనంతరం ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకు విసుగు చెందిన ప్రజలు వైసీపీకి 11 స్థానాలను కట్టబెట్టారన్నారు. కూటమి ప్రజారంజక పాలనను అందిస్తుందన్న నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. వైజాగ్ ప్రొఫైల్స్ ప్రతినిధులు లలితకుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వీవీ కృష్ణారావు, చిన్న సురేశ్, మల్లికార్జున, శ్రీను, పి.మురళీ మోహన్, రామారావు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం సీఐగా విద్యాసాగర్



మల్కాపురం, జూన్ 23: మల్కాపురం పోలీస్ స్టేషన్ సీఐగా ఎ.విద్యాసాగర్ ఆదివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో మల్కాపురం సీఐగా ఉన్న సన్యాసినాయుడు ఓ వివాదం కారణంగా సస్పెండ్ అవ్వగా, ఇన్‌చార్జిగా సన్నావుల్లా వ్యవహరించారు. తాజాగా సీపీ రవిశంకర్ సీఐగా విద్యాసాగర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. కాగా గతంలో మల్కాపురం ట్రాఫిక్ సీఐగా విద్యాసాగర్ పని చేసిన అనుభవం ఉన్నందున ఈ ప్రాంతంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు ప్రజలతో స్నేహభావంతో మెలుగుతామన్నారు. ఆయనను పోలీసు సిబ్బందితో పాటు స్థానికులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థలతోనే ఉపాధి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, జూన్ 23: ఉపాధి అవకాశాలకు ప్రభుత్వ రంగ పరిశ్రమలే కీలకమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,228వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే నిరుద్యోగం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు ఉద్యమాలను తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ ఉక్కు ఉత్పత్తి ప్రారంభించి నాలుగు దశాబ్దాలు గడిచినా ఇప్పటివరకు సొంత గనులను కేటాయించకపోవడం దారుణమన్నారు. ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించేంత వరకు తాము పోరాటాలను ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు,రామ్మోహన్‌కుమార్, మల్లయ్య, తౌడన్న, పల్లా పెంటారావు, శ్రీనివాసనాయుడు, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 66, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 40, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 48, బీరకాయలు 42, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 28, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 160, మునక్కాడలు (కిలో) 150, బరబటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 164, పొటల్స్ 40, కీరదోస 30, క్యాప్సికమ్ 88, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, కంద 60, చిలగడదుంపలు 40, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..

ఎస్సీ కాంప్లెక్స్ స్థలానికి రెక్కలు!

స్థానిక నాయకుల అండతో ఆక్రమణలు, దుకాణాల ఏర్పాటు

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక యువకుల ఆరోపణ



హరిజన జగ్గయ్యపాలెంలో ఆక్రమణలకు గురవుతున్న ఎస్సీ కాంప్లెక్స్ స్థలం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 23: జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని హరిజన జగ్గయ్యపాలేనికి ఆనుకుని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హరిజన జగ్గయ్యపాలెం శ్మశానవాటికకు, ఇక్కడి కుంచుమాంబ అమ్మవారి మాన్యానికి మధ్యలో ఉన్న సుమారు ఎకరా సర్కారు స్థలంలో విద్యావంతులైన స్థానిక నిరుద్యోగ దళిత యువకులకు ఉపాధి కల్పించేందుకుగాను ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించనున్నట్టు 2017లో అప్పటి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. అప్పట్లో ఈ స్థలాన్ని ఆయన పరిశీలించడంతో పాటు త్వరలోనే కాంప్లెక్స్ నిర్మిస్తామని ఆయన ఇక్కడి పెద్దలకు తెలపడంతో అందరూ ఆనందం వ్యక్తం చేశారు.

అయితే ఆ తర్వాత నిధుల లేమితో పాటు ఇతర కారణాల వల్ల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరగలేదు. దీంతో కొంతమంది పలువురు ఈ స్థలంలో తాత్కాలిక బడ్డీలు, తోపుడుబళ్లు పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం షాపింగ్ కాంప్లెక్స్ కడితే బడ్డీలను తొలగిస్తామని వారికి కాలనీ పెద్దలు తెలపడంతో వారు అభ్యంతరం తెలపలేదు. అయితే ఆ తర్వాత ఈ స్థలంలో వ్యాపారులు తమ బడ్డీలు స్థానంలో పక్కా దుకాణాల నిర్మాణం చేపట్టడం ప్రారంభించారు. ఈ అక్రమ నిర్మాణాలకు కొంతమంది స్థానిక నాయకులు మద్దతు తెలిపి దుకాణదారుల నుంచి సొమ్ములు వసూలు చేసుకుంటున్నారు. ఈ నిర్మాణాలపై హరిజన జగ్గయ్యపాలేనికి చెందిన కొందమంది పెద్దలు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ స్థానిక నాయకుల అండతో ఈ స్థలంలో మరిన్ని నిర్మాణాలు చేపడుతుండడం గమనార్హం.

ఇక్కడి ఆక్రమణలపై కాలనీ పెద్దలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానిక యువకులు ఆరోపిస్తున్నారు. దీనిపై గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర నాయకుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించి ఈ స్థలంలో ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని హరిజన జగ్గయ్యపాలేనికి చెందిన పలువురు పెద్దలు కోరుతున్నారు.

జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

గాజువాక, జూన్ 23: భారతీయ జనసంఘ్ పార్టీ సంస్థాపక అధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం గాజువాకలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీను, వి.రోహిణి, బొండా యల్లాజీరావు, సోంబాబు, శశిధరన్‌పిళ్లై, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు శాతవాహననగర్‌లో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఇక్కడి బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షురాలు బొండా శ్రీదేవి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొండా ఎల్లాజీ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం తన జీవితాన్నే పణంగా పెట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరావు, కృష్ణంరాజు, రామలక్ష్మి, భాస్కర్, లావణ్య, నీలవేణి, తదితరులు పాల్గొన్నారు. అలాగే పాత కూర్మన్నపాలెంలో ఏపీ రాష్ట్ర బీజేపీ కో-ఆర్డినేటర్ వెన్నా శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ కశ్మీర్ పరిరక్షణ కోసం పోరాటాలు చేసి, జైలుకు వెళ్లిన భరతమాత ముద్దుబిడ్డ ముఖర్జీ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గీతాసింగ్, గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: భరతమాత ముద్దుబిడ్డ, జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయ్ బాబు ఆధ్వర్యంలో గాజువాక ఆర్టీసీ డిపో ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖర్జీ సేవలను వివరించారు. అలాగే ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీను పుష్పమాల వేసి అంజలి ఘటించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం ముందు భాగం



వికాస్‌నగర్‌లో ఆధునీకరణ పనులు చేపట్టిన స్విమ్మింగ్‌పూల్

చకచకా ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులు

మరో రెండు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం

పెదగంట్యాడ, జూన్ 23: జీవీఎంసీ 65వ వార్డు పరిధి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ ఆధునికీకరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇండోర్ స్టేడియం వెలుపల, టాప్, ఫ్లోరింగ్ పూర్తిగా పాడయ్యాయి. 2012లో స్టేడియంను ప్రారంభించినప్పటి నుంచి దీనికి ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరింది. లోపల భాగంలోని వుడెన్ ఫ్లోరింగ్ మొత్తం పాడైపోయింది. అదేవిధంగా వాకింగ్ ట్రాక్ కూడా మట్టితో నిండిపోయింది. మరుగుదొడ్ల సముదాయం, నీటి సరఫరా వ్యవస్థతో పాటు స్విమ్మింగ్‌పూల్ పరిస్థితి దారుణంగా తయారయ్యాయి. స్విమ్మింగ్‌పూల్ అయితే మొత్తం మట్టితో నిండి దుర్భరంగా మారింది. దీంతో పలువురు క్రీడాకారులు, వాకర్స్ స్టేడియంకు మరమ్మతులు చేపట్టాలని జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. జీవీఎంసీ మేయర్, కమిషనర్, ఇతర అధికారులు, పాలక మండలి సభ్యులు ఏడాది క్రితం స్టేడియంను పరిశీలించి, సుమారు రూ.ఆరు కోట్లతో ఆధునీకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించగా, ప్రస్తుతం చకచకా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ అందుబాటులోకి రాగలదని కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు తెలిపారు.



స్కూల్ ఎదుట నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

వీవీవీ స్కూల్ ఉపాధ్యాయుల ఆందోళన

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 23: స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళనకు పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు తమ జీతాలను తగ్గించుకోవాలని చెప్పడం సరికాదని, ఆర్థిక భారం కారణంగా ఇలా చెప్పడంతో ఉపాధ్యాయుల్లో ఆత్మస్థైర్యం తగ్గిపోతుందన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని, స్కూల్‌కు ఉక్కు యాజమాన్యం సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, చందు, వాసు, విజయ్, కనకభవాని, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి, జూన్ 23: వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని రాంపురంలో గల వైసీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి ఆదినుంచి అండగా నిలిచిన కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉంటానని, రానున్న కాలంలో ప్రజల పక్షాలన పోరాటాలు సాగిస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ మదుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి కనకరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, మెంటి మహేశ్, రవికుమార్, భగవాన్ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా శిథిల నిర్మాణాలు



గోపాలపట్నం, జూన్ 23: శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు ఎప్పుడు కూలుతాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలో నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన జిల్లా పరిషత్ వసతిగృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. సుమారు రెండున్నర దశాబ్దాలుగా వీటిని ఎవరూ వినియోగించడం లేదు. దీంతో కొందరు నిరాశ్రయులు వీటిలో తలదాచుకుంటున్నారు. అయితే శిథిలమైన ఈ భవనాలు ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు వీటిని కూల్చివేయాలని పలువురు కోరుతున్నారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

భెల్ హెచ్‌పీవీపీకి పూర్వ వైభవం తీసుకురావాలంటూ కేంద్ర మంత్రికి వినతి

అక్కిరెడ్డిపాలెం, జూన్ 23: దేశంలో హెవీ వెసల్స్ తయారీలో ప్రత్యేక స్థానాన్ని సాధించిన భెల్ హెచ్‌పీవీపీకి ఉత్పత్తి రంగంలో పూర్వ వైభవం తీసుకురావాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు హెచ్‌పీవీపీ బీఎంఎస్ యూనియన్ నాయకులు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయనను విజయవాడలో నాయకులు కలిసి కర్మాగారంలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. కర్మాగారానికి నూతన వర్క్ ఆర్డర్లు వచ్చేలా చూడాలని, నూతన సిబ్బంది నియామకానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. భెల్ యాజమాన్యంతో చర్చించి తగిన చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్టు నాయకులు ఎ.రమేశ్‌కుమార్, కె.సతీశ్ కుమార్, ఎ.లోవరెడ్డి తెలిపారు.

పాలిథిన్‌ను నిషేధించాలంటూ ర్యాలీ



వడ్లపూడి రైతుబజారులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, జూన్ 23: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి చేపల, మాంసం మార్కెట్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాలిథిన్ కవర్లను వినియోగించరాదంటూ తిరుమలనగర్ కాలనీ వాసులు ఆదివారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. చేపలు, మాంసాలకు స్టీల్ బాక్సులను తీసుకువెళ్లాలని, మార్కెట్‌లకు వెళ్లేవారు క్లాత్ సంచులను వినియోగించాలని, భావితరాల భవిష్యత్తును పాడు చేయరాదంటూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, పరమానందం, మూర్తి, వసంతరెడ్డి, సన్యాసిరావు, భాస్కరరావు, సోమరాజు, తదతరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

ఉత్తమ రచనలతోనే సమాజాభివృద్ధి

సినీ నటుడు ప్రసన్నకుమార్

అగనంపూడి, జూన్ 23: సమాజాభివృద్ధికి ఉత్తమ రచనలు ఎంతగానో దోహదపడతాయని సినీ నటుడు ఐ.ప్రసన్నకుమార్ అన్నారు. కొండయ్యవలసకు చెందిన కవి కంచిపాటి వెంకట్ రచించిన 'ఆకుపచ్చని జ్ఞాపకం'పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదయాల పరిరక్షణకు ఉత్తమ రచనలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. అనంతరం గురుమూర్తి స్మారక కవితలు, కథల పోటీల విజేతలకు ప్రసన్నకుమార్ బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో రచయితలు చెల్లూరి సాంబమూర్తి, డి. దుర్గాప్రసాద్, కె. సూర్యనారాయణ, స్థానిక నాయకులు బొండా అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, ఐఆర్‌సీహెచ్ అప్పారావు, వరహాలు, సుబ్బారావు, ఫైడిరాజు, రమేశ్‌బాబు, వడ్డాది శ్రీను, పెదిరెడ్ల నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మూలకు చేరిన లిఫ్ట్

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు



మరమ్మతులకు గురైన లిఫ్ట్

కూర్మన్నపాలెం, జూన్ 23: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్-4పై ఉన్న లిఫ్ట్ మరమ్మతులకు గురవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా లిఫ్ట్ పని చేయకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ప్లాట్‌ఫాం-1 నుంచి 4కు లగేజీలతో వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రూ.25 లక్షలతో నిర్మితమైన ఈ లిఫ్ట్ ఇప్పటికే పలుమార్లు మరమ్మతులకు గురైంది. అధికారులు తూతూ మంత్రంగా సమస్యను పరిష్కరిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఇక్కడి లిఫ్ట్ సజావుగా పనిచేసేలా తగిన చర్యలు చేపట్టాల్సిందిగా దువ్వాడ రైల్వే అసోసియేషన్ ప్రతినిధులు కె.ఈశ్వర్, శ్రీనివాస్, జామవా, రామకృష్ణ, వీర్రాజులు కోరుతున్నారు.

ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



శ్రీవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

అగనంపూడి, జూన్ 23: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. ఇందులో భాగంగా స్వామివారికి ఆరాధన, పారాయణం, నిత్య హోమం, పూర్ణాహుతి, నవకలశ పూజ, చక్రస్నానాలతో పాటు పుష్పయాగాన్ని చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న వేదపండితులను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, జి.వెంకటరావు, సాయిబునాయుడు, నరసింగరావు, గురునాథరావు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నకు రేపు శ్రవణా నక్షత్ర పూజలు

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25న స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, స్వర్ణ పుష్పార్చన, అభిషేకాలు చేయనున్నట్టు అర్చకులు శ్రీనివాసస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

సింహాచల దేవస్థానానికి 2 వీల్‌చైర్లు బహూకరణ

మల్కాపురం, జూన్ 23: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సింహాచల దేవస్థానానికి వైజాగ్ మెడికల్ సిండికేట్ (హిందుస్థాన్ షిప్‌యార్డు కాలనీ) సహకారంతో ఆదివారం ఉదయం రెండు వీల్‌చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా సిండికేట్ ప్రతినిధులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఎంతో ఆనందం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డు డీజీఎం కోటేశ్వరరావు, సూపరింటెండెంట్ కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులకు భంగం కలిగితే సహించం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 23: దేశంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేసేందుకు దిగుతుందని, కార్మిక హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను అమలు తెచ్చేందుకు సిద్ధపడుతుందన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మారిస్తే అవి యాజమాన్యాలకు అనుకూలంగా ఉంటాయన్నారు. దీనివల్ల కార్మిక వర్గం శ్రమ దోపిడికి గురవుతుందన్నారు. జూలై పదిన దేశ వ్యాప్తంగా చేపట్టనున్న కోర్కెల దినాన్ని కార్మికులంతా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.జ్యోతేశ్వరరావు, పి.మణి, బి.జగన్, వెంకటరెడ్డి, శ్రీనివాస్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

పెదగంట్యాడ, జూన్ 23: అప్రకటిత విద్యుత్ కోతలో 65వ వార్డులోని పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసంగా రోజుకు రెండు, మూడుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నది. మండుతున్న ఎండలు, ఉక్కపోతకు తోడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. వృద్ధులు, బాలింతలు, చిన్నారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. పెదగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలోని యాతపాలెం, వెంకన్నపాలెం, కొత్తదిబ్బపాలెం, అశోక్‌నగర్ ప్రాంతాల ప్రజలు విద్యుత్ కోతలతో విలవిల్లాడుతున్నారు. ప్రజల ఇక్కట్లను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం కరెంటు సరఫరా ఉండేలా చర్యలు చేపట్టవలసిందిగా ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు పుష్పగుచ్ఛమిస్తున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి: అసెంబ్లీ స్పీకరుగా ఎంపికైన చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఆదివారం విజయవాడలో టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.

సంగీతానికి ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం..



సంగీత కళాకారుడు ఆకొండ వెంకటరావును సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, జూన్ 23: సంగీతానికి ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయ ప్రాంగణంలో శృతిలయ, మెలోడి క్రియేటర్స్, రసరాగా మాధురి సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కులపతి ఐవీఎల్ శాస్త్రి స్థాపించిన సంగీత జనకులం ద్వారా గత 23 ఏళ్లపైగా శాస్త్రీయ సంగీతానికి నిస్వార్థమైన సేవలందిస్తున్న బ్రహ్మశ్రీ ఆకొండ వెంకటరావును ప్రముఖ న్యాయవాది ఎంబర్ మన్నార్ దేవస్థానం మాజీ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా సత్కరించి అభినందించారు. ఉచితంగా సంగీత శిక్షణ ఇస్తూ ఎంతో మందిని తీర్చిదిద్దారని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొణతాల రాజు, ఆధ్యాత్మికవేత్త ఎం.రాజశేఖర్, వి.ప్రభాకర్, సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎం.ఎస్.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'కూన'కు సాదర స్వాగతం



మాధవధారలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

మురళీనగర్, జూన్ 23 ; తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన.రవికుమార్‌కి ఆదివారం విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు సాదర స్వాగతం పలికారు. శాసన సభ్యునిగా ప్రమాణ స్వీకారం తర్వాత మొదటిసారి విశాఖ ఎయిర్‌పోర్టుకి చేరుకున్న ఆయనకు నాయకులు స్వాగతం పలికారు. కళింగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే కావడంతో, మాధవధారలో ఉన్న ఆ వర్గ నాయకులు, విశాఖ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి తదితరులు ఎమ్మెల్యేని బిర్లా జంక్షన్‌కు ఆహ్వానించి గజమాలతో సత్కరించారు. అనంతరం బిర్లా జంక్షన్‌లో ఉన్న టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి రవికుమార్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పృథ్వీరాజ్, సనపల.నరసింహ, పార్టీ నాయకులు, అభిమానులు ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం



అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూన్ 23: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము ఆరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. విశాఖ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ఆరంభమైంది. దీంతో ఆలయానికి వచ్చే మార్గాలు సందడిగా మారాయి. పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించి అంతా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పలువురు భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అస్తవ్యస్తంగా కాలువ నిర్మాణం

» వరద నీటి ముంపు నిరోధానికి రూ. 38 లక్షలతో డక్ట్ నిర్మాణం » పనుల తీరుపై స్థానికుల అసంతృప్తి » పెన్సింగ్ తొలగింపు



కొత్తగా నిర్మించిన కాలువ దుస్థితి



తీసి పడేసిన పెన్సింగ్

మురళీనగర్, జూన్ 23; గ్రేటరు 51వవార్డులో ఎన్నికల కోడ్ వెలువడక ముందు వైసీపీ నాయకులు ఆదరాబాదరాగా కొత్త నిర్మాణాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. వీటిలో భాగంగా రూ.39 లక్షలతో పోలీసు స్టేషన్ ఎదుట, ఆర్అండ్‌బీ ఆఫీసు వద్ద కాలువపై డెక్టుల నిర్మాణం చేపడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వానాకాలంలో వచ్చే వరద నీటి ముంపు సమస్యకు పరిష్కారంగా ఈ పనులు చేస్తున్నారు. త్రికోణ ఆకారంలో నిర్మించి ఈ డెక్ట్ పనులు దాదాపు తుది దశకు చేరాయి. అయితే, ముందు చూపుతో ఈ నిర్మాణం విషయంలో కనీసం జాగ్రత్తలు పాటించడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ఈ పనుల లక్ష్యం ఏ మేరకు నెరవేరుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీఏ కార్యాలయం మలుపు నుంచి ఎయిర్‌పోర్టు జోన్ పోలీసుస్టేషను వరకు రోడ్డను ఆనుకొని చేపట్టిన డెక్టు కట్టడం వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి భద్రతా కల్పించచడంలేదు. దీంతోపాటు జీ-20 సదస్సుల సమయంలో ఈ రోడ్డులో వేసిన పెన్సింగ్‌ను ఈ పనుల కోసమని తీసేసి పక్కన పడేశారు. పచ్చదనం పెంపు అంటూ అక్కడి దుకాణాలను కూడా ఆఘమేఘాల మీద తొలగించారు. గానీ, నిర్వహణ శూన్యం. పచ్చదనం జాడే లేదు. చేపడుతున్న పనుల వల్ల డెక్టుల్లో ఓ వైపు మాత్రమే మురుగు నీరు పారే అవకాశం ఉంది. పోలీసు స్టేషను వైపు నిర్మించిన డెక్టు వృథాగా మారింది. ఇక్కడ మురుగునీటి పారుదలకు ఎగువ నివాసిత ప్రాంతాల నుంచి గానీ, ఆర్అండ్‌బీ కార్యాలయం, పోలీసు స్టేషను పరిసరాలు, ఉడాకాలనీ నివాసాల నుంచి అనుసంధానం కల్పించ లేదు. దీంతో ప్రస్తుతం చేపట్టిన పనులతో ఏ మేరకు ప్రయోజనం ఉందో తెలియకున్నా, ఇక్కడి ఫెన్సింగ్‌ను మాత్రం తొలగించారు. దీంతో వరద నీటి నిర్వహణ ఏ మేరకు గాడిన పెడతారో ప్రశ్నార్థకంగా మారింది.

ఎంపీ శ్రీభరత్‌కు అభినందన



శ్రీభరత్‌కు జ్ఞాపిక అందిసున్న జోగా మహేష్ తదితరులు

కంచరపాలెం, జూన్ 23 : విశాఖ ఎంపీగా గెలుపొందిన ఎం. శ్రీ భరత్‌ను జీవీఎంసీ 55, 46 వార్డులకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఆదివారం కలిసి అభినందించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జోగా మహేష్ ఆధ్వర్యంలో నాయకులు వెంకటేశ్వరరావు. బింగిరాజు రెడ్డి, నరసింగరావు తదితరులు భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఫొటో ఉన్న జ్ఞాపికగా అందజేశారు. నగరాభివృద్ధిలో తమ వంతు కృషి చేస్తామని నాయకులు ఎంపీకు వివరించారు.

పోర్టు స్టేడియంలో ఉచిత ప్రవేశంపై హర్షం

అక్కయ్యపాలెం, జూన్ 23: పోర్టు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లకు పోర్టు మైదానంలో ఉచిత ప్రవేశం కల్పించేందుకు మైదానం అధినేత కాశీ అంగీకరించడంపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం నిర్వాహకుడితో తాము చర్చించామని, వెంటనే సానుకూలంగా స్పందించారని చెప్పారు. అలాగే, ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా అభినందనలు దేముడు తెలిపారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన పి.విష్ణుకుమార్‌రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంక్షేమం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వరంగ సంస్థలు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా చూడాలని కోరారు.

ఫ్యాషన్ షో అదరహో



ర్యాంప్ వాక్ చేస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు

మహారాణిపేట, జూన్ 23: సాగర తీరాన అతివలు అందాలతో అదరహో అనిపించారు. ఆదివారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని హోటల్ నోవాటెల్‌లో జేడీ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థ వార్షిక ఫ్యాషన్ డిజైన్ అవార్డుల వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు అభ్యసిస్తున్న బెంగళూర్, హైదరాబాద్ తదితర నగరాలకు చెందిన విద్యార్థులు తాము డిజైన్ చేసిన విభిన్న రకాల దుస్తులను ధరించి వేదికపై ర్యాంప్ వాక్, క్యాట్ వాక్ చేసిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. సుమారు 30 మందికి పైగా విద్యార్థినులు సుమారు 300 పైగా డిజైన్ చేసిన దుస్తులతో ఏడు రౌండ్ల ఫ్యాషన్ షోలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని తొలుత ప్రారంభించారు. షోలో ప్రతిభ చూపిన ఐదుగురికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాండెక్స్ అధినేత దొరస్వామి రాజు, కట్టమూరి ప్రదీప్, రేస్ సంస్థ దాడి రవికుమార్, ప్రసన్నకుమార, ప్రసాదరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

త్రిశక్తి వైభవంపై ప్రవచనం

అక్కయ్యపాలెం, జూన్ 23: గురుదేవుల ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితా పీఠంలో శ్రీ శక్తి పీఠాధిపతి మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతీ స్వామిని ఆదివారం రాత్రి వాదీశ్వరి రూపంపై ప్రవచనం చేశారు. లలితాదేవికి సంబంధించిన రూపాల్లో వశీన్యది వాగ్దేవతలు లలిత సహస్రనామాలు నిర్వహించిన వారు. వీళ్ల శక్తిని అనుగ్రహిస్తారని వివరించారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ స్వామి సమక్షంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణ సేన్ పర్యవేక్షించారు.

ఘంటసాల తెలుగు జాతికి వరం

సీతంపేట, జూన్ 23: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘంటసాల ఆరాధనోత్సవం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు సయ్యద్ రహమతుల్లా నిర్వహణలో జరిగిన ఈ వేడుకలో ఘంటసాల పాటలను గాయనీగాయకులు గానం చేశారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా మేడా మస్తాన్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ జి.మహేష్, డాక్టర్ జీవీ రావు, కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు. ఘంటసాల గానం ఎన్ని తరాలైనా మరిచిపోలేని అనుభూతినిస్తాయన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ఆయన ఓ వరమని కొనియాడారు.

సినీ రంగానికి బాల సుబ్రహ్మణ్యం సేవలు చిరస్మరణీయం

అక్కయ్యపాలెం, జూన్ 23 : ప్రముఖ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం చలన చిత్ర రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని సినీ నిర్మాత, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. బాల సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సంగం ఆఫీస్ జంక్షన్‌లోని స్వరాలయ రికార్డింగ్ స్టూడియోలో నిర్వహించిన ఎస్పీ సినీ సంగీత విభావరిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాయకునిగా, నటుడుగా, సంగీత దర్శకుడిగా, స్టూడియో అధినేతగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా బాలు సినీరంగానికి విశేష సేవలందించారని ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, ఆధ్యాత్మికవేత్త ఎస్.ఫణిస్వామి, మాజీ ఏడీసీపీ మహ్మద్ ఖాన్, ఉపాధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఘంటసాల ఆరాధనోత్సవంలో రచయితలు, కవులు తదితరులు

కంచరపాలెం సీఐగా సీహెచ్ ప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్

కంచరపాలెం, జూన్ 23 : కంచరపాలెం పోలీస్ స్టేషన్ శాంతిభద్రతల విభాగం సీఐగా సీహెచ్.ప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.ప్రస్తుతం ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న సీఐ ఎస్.భాస్కరరావు అనారోగ్యంతో సెలవులో ఉండడంతో ఆయన స్థానంలో ప్రసాద్‌ను సీఐగా సీపీ రవిశంకర్ నియమించారు. ప్రసాద్ నగరంలో గాజువాక, మూడు, నాలుగో పట్టణ స్టేషన్‌లలో గతంలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ప్రసాద్ ఇక్కడికి వచ్చారు.ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతు శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సిబ్బందితో కలిసి కృషి చేస్తానని అన్నారు.

పాత చలానాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్



తనిఖీలు చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

జగదాంబ కూడలి, జూన్ 23: టూవీలర్స్ నుంచి పాత చలానాల వసూలుకు నగర ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆదివారం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ గుడి, బ్యారెక్స్ మెయిన్ రోడ్డు, జగదాంబ, లేపాక్షి వద్ద ఈ మేరకు తనిఖీ చేపట్టారు. సిటీలో షాపింగ్, మార్కెట్ పనులపై వచ్చిన వాహనాలను నిలిపి చలానా వసూలు చేయడంపై వాహనదారులు అసహనం వ్యక్తంచేశారు. కుటుంబాలతో ఆదివారం సరదాగా వచ్చిన వారు ట్రాఫిక్ పోలీసులు తనిఖీలతో ఆందోళన వ్యక్తంచేశారు. చలానాల పెండింగ్ వాహనాలకు సంబంధించి పత్రాలు, నంబర్ ప్లేట్‌లను తనిఖీ చేసి జరిమానాలు విధించారు. లేపాక్షి వద్ద ట్రాఫిక్ సర్కిల్ వద్ద వాహన రాకపోకలను గాలికి వదిలేసి టూవీలర్స్‌ను అడ్డుకోవడం విమర్శలు తలెత్తాయి.

విజ్ఞాన భాండాగారం పీవీ నరసింహారావు



మాట్లాడుతున్న పీవీ తనయుడు ప్రభాకరరావు

మహారాణిపేట, జూన్ 23: మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు ఓ విజ్ఞాన భాండాగారమని ఆయన తనయుడు పీవీ ప్రభాకరరావు అన్నారు. ఆదివారం మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న పీవీ నరసింరావు 104వ జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో జడ్పీ జంక్షన్‌లోని అంకోశా సమావేశమందిరంలో అభినందన సభ నిర్వహించారు.. ముందుగా పీవీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీవీ పదహారు అణాల తెలుగువారని, విషయ పరిజ్ఞానంలో జ్ఞాన పిపాసీ అని కొనియాడారు. తన చిన్నతనంనుంచి బానిస మనస్తత్వం నచ్చేదికాదని, నిజాం నవాబులు వందేమాతరం గీతాన్ని నిషేధించడాన్ని ఆయన వ్యతిరేకించారని తెలిపారు , దేశంలో విద్య, ఆర్థిక, భూ సంస్కరణలు తీసుకువచ్చిన మేధావి అని అన్నారు. పీవీకి విశాఖనగరం అంటే ఎంతో ఇష్టమని, ఆయనకు రాష్ట్రంలో తొలిసారి విగ్రహానికి ఇక్కడే ఆవిష్కరించారన్నారు. ఈ సమావేశంలో ప్రముఖులు ప్రసన్న కుమార్, డాక్టర్ రఘురామారావు పాల్గొన్నారు.

జోరుగా ఫుట్‌పాత్ వ్యాపారాలు

జగదాంబ కూడలి, జూన్ 23: పూర్ణామార్కెట్ సమీపంలో ఆంజనేయ స్వామి గుడి మెయిన్ రోడ్డు విస్తరణతో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ వ్యాపారాలు ఆదివారం కావడంతో జోరుగా సాగాయి. పూర్ణా థియేటర్ మెయిన్ రోడ్డును వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు జరిపారు. దీంతోట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి.



రోడ్డుపై వ్యాపారం సాగిస్తున్న దృశ్యం

ఆంధ్ర సీనియర్ క్రికెట్ జట్టు కోచ్‌గా టిను యోహానన్



టిను యోహానన్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 23: ఆంధ్ర సీనియర్ పురుషుల జట్టుకు భారత మాజీ క్రికెటర్ టిను యోహానన్ ప్రధాన కోచ్‌గా నియమితులయ్యారు. 2024-25 సీజన్‌కుగాను పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా ఆయన వ్యవహరించనున్నారు. కేరళకు చెందిన యోహానన్ 2001-2002లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లలో మూడు మ్యాచ్‌లు.. 2002లో వెస్టిండీస్, శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లలో మూడు మ్యాచ్‌ల్లో భారత్ సీనియర్ క్రికెట్ జట్టుకు ఆడారు. ఇక, అండర్-23 పురుషుల జట్టుకు జె.కృష్ణారావు, సీనియర్ మహిళల జట్టుకు ఎంఎస్.విక్రమ్‌వర్మ, అండర్-23 మహిళల జట్టుకు ఎస్. రమాదేవిలను ప్రధాన కోచ్‌లుగా నియమితులయ్యారు. మహిళల అండర్-19 విభాగానికి ఎస్. శ్రీనివాసరెడ్డి, అండర్-15 విభాగానికి ఎం.సవిత ప్రధాన కోచ్‌లుగా వ్యవహరించనున్నారు. సీనియర్ పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా నియమితులైన యోహానన్‌తోపాటు వివిధ విభాగాలకు ప్రధాన కోచ్‌లుగా నియమితులైన వారి శిక్షణలో ఆంధ్ర జట్లు మంచి ఫలితాలు సాధిస్తాయని ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు శరత్ చంద్రారెడ్డి, ఎస్ఆర్.గోపీనాథరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

టమాటా కోసం బారులు తీరిన జనం



నరసింహనగర్ రైతుబజారులో కొనుగోలుదారుల క్యూ

అక్కయ్యపాలెం, జూన్ 23: టమాటా ధర రోజురోజుకు పెరిగి ఆకాశాన్నంటుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినడంతో వాటి దిగుబడి తగ్గింది. దీంతో టమాటాకు గిరాకీ పెరిగింది. రైతుబజార్లలో టమాటా ధరను వ్యాపారులు పెంచారు. దీంతో రైతు బజారులో టమాటా కిలో రూ.66కి చేరింది. అయినా, వినియోగదారులు క్యూలో నిల్చొని కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లలో కిలో రూ.90 నుంచి రూ.110 వరకు విక్రయిస్తున్నారు. ఎక్కువ శాతం టమాటా మదనపల్లె నుంచి దిగుమతి అవుతుంది. అక్కడి నుంచి కూడా దిగుమతి తక్కువగా రావడంతో వ్యాపారులు సతమతమవుతున్నారు. రైతుబజార్లలో తప్పని సరై డ్వాక్రా సంఘాల సభ్యులు విక్రయిస్తున్నారు. నరసింహనగర్ రైతుబజారులో టమాటా కోసం వినియోగదారులు ఆదివారం ఉదయం నుంచి బారులు తీరారు. వారం రోజులోనే టమాటా ధర ఎక్కువగా పెరిగింది. రానున్న రోజుల్లో మరింతగా పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి టమాటను సబ్సిడీ ద్వారా విక్రయించాలని వినియోగదారులు కోరుతున్నారు.

'హత్యాచార ఘటన దురదృష్టకరం'



మాట్లాడుతున్న ఈతలపాక సుజాత

మహారాణిపేట, జూన్ 23: బాపట్ల జిల్లాలో యువతి హత్యాచార సంఘటన దురదృష్టకరమని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఘటనపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తక్షణం స్పందించి హోం మంత్రి అనితకు ఆదేశాలు ఇవ్వటంతో ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరఫున రూ.10 లక్షలఎక్స్‌గ్రేషియా అందించినట్టు చెప్పారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వైసీపీ ప్రభుత్వం జగన్‌మోహన్ రెడ్డి స్పందించిన పాపాన పోలేదని అన్నారు. తమది ప్రజా ప్రభుత్వం... ప్రజల పక్షాన నిలిచే ప్రభుత్వం కావడంతో హత్యాచార బాధితురాలి కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గనగళ్ల సత్యవతి, దక్షిణ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కేదారి లక్ష్మి, నార్త్ అధ్యక్షురాలు తోట శ్రీదేవి పాల్గొన్నారు.

మేయర్‌కు పదవీ గండం?

... 3వ పేజీ తరువాయి

అనూహ్యంగా ఆయనను పక్కనపెట్టి 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారిని వైసీపీ అధిష్ఠానం మేయర్‌గా ప్రకటించింది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జీవీఎంసీ పరిధిలోని ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో చాలామంది వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చేరిపోయేందుకు సిద్ధపడుతున్నారు. ఇందులో భాగంగా తమకు పరిచయమున్న నేతల ద్వారా తమ ఆసక్తిని వ్యక్తంచేస్తున్నారు. దీంతో మేయర్‌ను మార్చేయాలని కూటమి నేతలు నిర్ణయించారు. ఇందుకు అవిశ్వాస తీర్మానం పెట్టాలి. కానీ చట్ట ప్రకారం స్థానిక సంస్థల పదవీకాలం కనీసం నాలుగేళ్లు పూర్తైతేనే అందుకు అవకాశం ఉంటుంది. జీవీఎంసీకి ఎన్నికలు జరిగి మూడున్నర సంవత్సరాలు కూడా పూర్తికాకపోవడంతో వీలుకాదు.

జీవీఎంసీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లో వైసీపీకి చెందినవారే మేయర్లు, చైర్మన్లుగా ఉన్నారు. వారందరినీ దింపి కూటమి నేతలను పదవిలో కూర్చోబెట్టాలంటే చట్టసవరణ తప్పనిసరికావడంతో ప్రభుత్వంలోని పెద్దలు ఆదిశగా ఆలోచన చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా అవిశ్వాసానికి మూడేళ్ల కనీస పదవీకాలం సరిపోతుందని మంత్రి మండలి ఆమోదించి, ఆ తర్వాత గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ జారీచేయించే అవకాశం ఉందని రాజకీయవర్గాలతోపాటు జీవీఎంసీలోని కొంతమంది అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర మంత్రి మండలి తొలి సమావేశం సోమవారం జరుగుతున్నందున ఈ అంశాన్ని కూడా అజెండాలో చేర్చినట్టు ప్రచారం జరుగుతోంది. అది జరిగితే మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానానికి అడ్డంకులు తొలగినట్టేనని భావిస్తున్నారు.

కలెక్టర్ పోస్టుకు పైరవీలు

... 3వ పేజీ తరువాయి

సంక్షేమశాఖలో పనిచేస్తున్నారు) పేరును కొందరు నేతలు ప్రభుత్వానికి సూచించారంటున్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయంలో అడిషనల్ సీఈవోగా ఉన్న ఎంఎన్ హరీంద్రప్రసాద్ పేరుకూడా ప్రముఖంగా వినిపిస్తోంది. ఇంకా నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న హరినారాయణన్ పేరును కొందరు నేతలు సూచించారని సమాచారం. వీరితో పాటు కర్నూలు నుంచి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన జి.సృజన తీవ్రంగా ప్రయత్నించారని సమాచారం. ఈమె గతంలో విశాఖ జాయింట్ కలెక్టర్‌గా, జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేశారు. ఆమెకు విశాఖ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చేందుకు పూర్తిస్థాయిలో నిర్ణయం జరిగిందని, అయితే టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఉన్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు అప్రమత్తమై మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి అభ్యంతరం వ్యక్తంచేశారని తెలిసింది. వైసీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సృజన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆదేశాలతో గాజువాకలో పల్లా వాణిజ్య కాంప్లెక్స్‌ను కూల్చివేశారు. దీనిపై ఆయన హైకోర్టులో దాఖలుచేసిన కేసులో జీవీఎంసీ కమిషనర్‌గా సృజన పేరు చేర్చారు. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉంది. కాగా గీతం భవనాలను కూల్చివేయడం, భీమిలిలో గంటా శ్రీనివాసరావుకు చెందిన టీడీపీ కార్యాలయం భవనం కూల్చివేతకు ప్రయత్నించడం అప్పట్లో వివాదాస్పదమైంది. ఈ విషయాలను మంత్రి లోకేశ్‌కు నేతలిద్దరూ వివరించారని తెలిసింది. దీంతో పాటు సృజన జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో నగరపాలక సంస్థ ఎన్నికలపై టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఆమెను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చినట్టు సమాచారం.

ఒకేసారి రెండు పరీక్షలు!

... 3వ పేజీ తరువాయి

నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. అదే సమయంలో దూరవిద్యలో ఎమ్మెస్సీ బోటనీ, ఫిజిక్స్, జువాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, మ్యాథ మెటిక్స్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు జూలై 31 నుంచి ఆగస్టు ఎనిమిదో తేదీ వరకు పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో ఈ రెండు కోర్సుల్లో చేరిన వందలాది మంది విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. బీఈడీ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్ష జరగనుండగా, ఎమ్మెస్సీ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఒకేసారి రెండు పరీక్షలకు ఎలా హాజరవుతామని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి షెడ్యూల్ మార్చాలని కోరుతున్నారు. కాగా ఈ అంశాన్ని ఇప్పటికే పలువురు ఏయూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కనిపించలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



సెల్ టవర్‌కు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పద్మనాభం (రూరల్), జూన్ 23 : మండలంలోని పాండ్రంగి గ్రామంలో రామాలయం ఎదురుగా సెల్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. టవర్‌కు 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. స్థానిక ఇళ్లకు ఈడీపీ ద్వారానే విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే పది రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఏర్తు వైర్ నుంచి పొగ వస్తుండడంతో నివాసితులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల వీచిన గాలులకు డీపీపై చెట్టు కొమ్మలు విరిగిపడడంతో పొగ వస్తుందని చెబుతున్నారు. ఈవిషయమై పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం నూతన కార్యవర్గం

వెంకోజీపాలెం, జూన్ 23 : జీవీఎంసీ పరిధిలోని 15, 17 వార్డుల్లో విస్తరించి ఉన్న కొత్తవెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా పీల కనకరాజు, ఉపాధ్యక్షుడిగా కాళ్ల ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా కాళ్ల నాయుడు, కార్యదర్శిగా రాపేటి రాము, సహాయ కార్యదర్శిగా పీల అప్పలరాజు, కోశాధికారిగా కిల్లంపాలి ఆచారి, ఆడిటర్‌గా బొడ్డేటి గోవింద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఏడాది పాటు కొనసాగనుంది.

నేటి నుంచి పైడిమాంబ పండగ

ఆరిలోవ, జూన్ 23 : జీవీఎంసీ 13వ వార్డులోని రామకృష్ణాపురం గ్రామ దేవత పైడిమాంబ పండగ సోమవారం నుంచి జరగనుంది. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం ప్రధాన పండగ నిర్వహించనున్నట్టు గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు తెలిపారు.

జూపార్కుకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, జూన్ 23 : నగరంలోని జూపార్కుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం 4063 మంది పర్యాటకులు జూను సందర్శించగా రూ. 3.44 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

బీచ్ ఫొటో గ్రాఫర్లకు యూనిఫారం పంపిణీ



దుస్తులు అందచేస్తున్న నాయకులు

భీమునిపట్నం, జూన్ 23 : రామాద్రి బీచ్ పార్క్‌లోని ఫొటోగ్రాఫర్లకు మంగమారిపేట మత్స్యకార నాయకుడు గరికిన ఎల్లయ్య ఆదివారం యూనిఫారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్లు బీచ్‌కు వచ్చే సందర్శకుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి తగిన సూచనలు, ప్రమాద హెచ్చరికలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సూరాడ నరసింగరావు, దూడ రమేష్, చీపుళ్ల ఎల్లాజి, రాజు, డి. ఎల్లారావు, ఎస్. అమ్మర్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహారాజ :** మెలోడీ, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 66, వంకాయలు(తెలుపు) 44, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 40, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 48, బీరకాయలు 42, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 28, క్యారేట్ 38, దొండకాయలు 32, బంగాళా దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 150, అల్లం (పాతది) 160, బరబటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 164, పొటల్స్ 40, కీరదోస 30, కాప్సికమ్ 88, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..

అసంపూర్తిగా రోడ్డు పనులు

- అత్యంత దారుణంగా చిన్నాపురం, పద్మనాభం రహదారి
- రాకపోకలకు స్థానికుల అవస్థలు

పద్మనాభం, జూన్ 23 : మండలంలోని చిన్నాపురం-పద్మనాభం-శొంఠ్యాం రోడ్డు పలుచోట్ల గోతులు పడి అత్యంత అధ్వానంగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు బాగా శిథిలం కావడంతో వార్షిక నిర్వహణ పనులు చేపట్టడానికి ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు ఎన్నికల ముందు సమాయత్తమయ్యారు. అందులో భాగంగా రోడ్డులోని రెడ్డిపల్లి శాంతినికేతన్, పద్మనాభం పోలీసు స్టేషన్, మద్ది ధర్మశాస్తా పీఠం సమీపంలోను, రేగానిగూడెం గ్రామం వద్ద జేసీబీతో రోడ్డును తవ్వి వెట్ మిక్సర్ వేసి రోలింగు చేశారు. కొన్ని రోజుల తరువాత బీటీ రోడ్డు వేద్దామనుకున్నారు. ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కోడ్ పేరుతో పనులను నిలిపివేశారు. వెట్ మిక్సర్ వేసిన ప్రాంతంలో గత మూడు నెలలు దుమ్ము, ధూళితో ప్రజలు అవస్థలు పడగా, ప్రస్తుతం పడుతున్న వర్షాలకు వెట్ మిక్సరు కొట్టుకుపోవడంతో రోడ్డులో గోతులు ఏర్పడ్డాయి. వాటిలో వర్షం నీరు చేరడంతో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెట్ మిక్సర్ వేసిన తరువాత పద్మనాభం సచివాలయం ఎదురుగా ఉన్న రోడ్డు లోతట్టు కావడంతో ఏమాత్రం వర్షం పడినా.. నీరు చేరి చెరువును తలపిస్తోంది.

దీనికితోడు ఇక్కడ ఉన్న కల్వర్టు కూడా మూసుకుపోవడంతో కాలువలో నీరు కూడా రోడ్డుపైకి వస్తోంది. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పద్మనాభంలోని సచివాలయం వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

త్వరలోనే మత్స్యకారుల ఇళ్ల సమస్యకు పరిష్కారం

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, జూన్ 23 : చేపల తిమ్మాపురం డ్రైఫిష్ ఉమెన్ సొసైటీ సభ్యులు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఆదివారం అయన చేపల తిమ్మాపురంలో ది విశాఖపట్నం టౌన్ ఫిషర్ ఉమెన్ డ్రైఫిష్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆ సంస్థ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన అభినందన సభలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాల సమస్యకు ఆటంకంగా ఉన్న సాంకేతిక ఇబ్బందులను పరిశీలించి, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.అనంతరం సొసైటీ సభ్యులకు బియ్యం బస్తా, నిత్యావసర సరకులు, నగదు అందించారు.



మత్స్యకార మహిళలకు బియ్యం అందిస్తున్న గంటా శ్రీనివాసరావు

తొలుత గంటాశ్రీనివాసరావును సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మారుపల్లి పార్వతమ్మ, మైలపల్లి ఎర్రమ్మ, అమరనాథ్ సత్కరించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సలహాదారుడు మారుపల్లి అమరనాథ్, మత్స్యకార నాయకులు గరికిన ఎల్లయ్య (కింగ్),తోని నాగరాజు, గంటా నూకరాజు, ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు, సూరాడ నరసింగరావు, కారి అప్పారావు, మైలపల్లి రాము, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో జగన్నాథుడికి స్నాన పూర్ణిమ

సాగర్‌నగర్, జూన్ 23 : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని జగన్నాథుడికి స్నాన పూర్ణిమను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయిసేవని పర్యవేక్షణలో ముగ్గురు దేవతామూర్తులతో పాటు సుదర్శనుణ్ణి స్నాన వేదికపై ప్రతిష్ఠించారు. అనంతరం జగన్నాథుడికి 35 కలశాలు, బలరాముడికి 33 కలశాలు, సుభద్రకు 22 కలశాలు, సుదర్శనుడికి 18 కలశాలతో అభిషేకం చేశారు. జగన్నాథుడికి ఏడాదికి ఒక్క రోజే జ్యేష్ఠ పూర్ణిమ నాడు అభిషేకం చేస్తారు. స్నానం సంపూర్ణం కాగానే జగన్నాథ, బలభద్రులను గజముఖాలతో అలంకరించారు. జగన్నాథుడు భక్తులకు గణనాథుడిగా దర్శనమిచ్చారు. అనంతరం దేవతామూర్తులను ఆలయ ఆవరణలోని చీకటి మందిరానికి తరలించారు. 15 రోజులు ప్రత్యేక సపర్యలు అనంతరం రథయాత్ర ముందు రోజున చీకటి గదిలో నుంచి మూలమూర్తులను తీసుకువచ్చి గర్భాలయంలో ప్రతిష్ఠించి ఆ రోజు నవయవ్వన దర్శనం కల్పించనున్నట్టు ఆలయ అర్చకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జగన్నాథుడుతో పాటు మిగతా దేవతామూర్తులకు స్నాన పూర్ణిమ



సందర్శకులతో కిటకిటలాడుతున్న బీచ్

రుషికొండ తీరంలో పర్యాటకుల సందడి

సాగర్‌నగర్, జూన్ 23 : రుషికొండ తీరంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. రెండు రోజులుగా చిరుజల్లులు పడుతుండడంతో తీర ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. దీంతో బీచ్‌లకు సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు ఎగసి పడుతున్న అలలు మధ్య స్నానాలు చేసి కేరింతలు కొట్టగా మరికొందరు బోటు షికారు చేసి ఉత్సాహంగా గడిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సాగర్‌నగర్, జూన్ 23 : సాగర్‌నగర్‌లోని ఎంబజీ సి గృహం వద్ద ఆదివారం ఉదయం విద్యుత్ వైరు తెగి నేలపై పడింది. ఆ సమయంలో అటువైపుగా ఎవరూ రాకపోకలు చేయకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి తెగిన వైరును అతికారు. అధికారులు స్పందించి కాలనీలో విద్యుత్ లైన్లపై పడిన చెట్లను తొలగించే పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా గాటిలమ్మ ఉత్సవం

పెదవాల్తేరు, జూన్ 23 : పెదజాలారిపేటలో గాటిలమ్మ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. వేకువజామున అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ రుద్ర అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ పండగను తొమ్మిదేళ్లకు ఒకసారి నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తెడ్డు సత్తెయ్య పరసన్న, సతీష్, చిన్నా తెడ్డు రాజు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈఓ జయదేవి

'బాలలు ఉన్నత పౌరులుగా ఎదగాలి'

భీమునిపట్నం, జూన్ 23 : బాలలు పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ ఈవో జి. జయదేవి ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని నేరేళ్లవలస కాలనీలో ఉన్న ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో ఎస్‌వోఎస్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చక్కటి జీవితాలందిస్తున్న ఎస్‌వోఎస్ సేవలను అభినందించారు. జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ ఎం. శరత్‌బాబు మాట్లాడుతూ ఎస్‌వోఎస్ బాలలు చదువుతోపాటు వృత్తి నైపుణ్యం పెంచుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరారు. అనంతరం, టెన్త్, ఇంటర్‌లో అధిక మార్కులు పొందిన వారికి బహుమతులు ఇచ్చారు. తొలుత సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ హెర్మన్ మైనరు విగ్రహానికి అతిథులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి మణికందన్, విశాఖ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎంఆర్ఎల్ రాధ, ఎఫ్ఎస్‌పీ ఇన్‌చార్జి దుర్గరాజ్, పాల్గొన్నారు.

కోడి పందాలు ఆడుతున్న ఏడుగురి అరెస్టు

ఆనందపురం, జూన్ 23 : దుక్కవానిపాలెంలో కోడి పందాల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేసి, ఏడుగురిని అరెస్టు చేశారు. సీఐ తిరుపతిరావు తెలిపిన వివరాలు ప్రకారం.. దుక్కవానిపాలెంలో కోడిపందాలు ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈమేరకు ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఏడు బైక్‌లు, పది వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వేములవలస శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.



నగరంలోని బీజేపీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న నాయకులు



భీమిలి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు నివాళి

ఆదర్శ నేత శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

వర్ధంతి సభల్లో బీజేపీ నాయకులు

విశాలాక్షినగర్, జూన్ 23 : భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు, కోల్‌కతా విశ్వవిద్యాలయం మాజీ వీసీ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి పురస్కరించుకుని జోడుగుళ్లపాలెంలో బీజేపీ నాయకులు ఆదివారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదానికి చేసిన కృషిని కొనియాడారు. బీజేపీ విశాఖ పార్లమెంట్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాతరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 9వ వార్డు బీజేపీ అధ్యక్షుడు పోలారావు, 18వ వార్డు అధ్యక్షుడు కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : నగరంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా పార్టీ నాయకులు నివాళి అర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ రాజు మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించారని, ఆయన గొప్ప జాతీయవాది, మానవతావాది అని కొనియాడారు. స్వాతంత్ర్య అనంతరం ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో ముఖర్జీ పారిశ్రామిక మంత్రిగా పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు బుద్దా లక్ష్మీనారాయణ, ఎస్‌వీఎస్ ప్రకాశ్ రెడ్డి, జె. దామోదర్‌యాదవ్, శ్రీ రంగం ధనేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఒకే దేశంలో పౌరులందరికీ ఒకే పౌర స్మృతి వుండాలని మొదటిసారిగా ఏకరువు పెట్టిన గొప్ప వ్యక్తి స్వర్గీయ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నియోజకవర్గ కన్వీనరు రామానాయుడు అన్నారు. ఆదివారం గాడువీధిలో వున్న ఆ పార్టీ కార్యాలయంలో ముఖర్జీ బలిదాన్ దివస్ పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భీమిలి డివిజన్ అధ్యక్షురాలు కంటుభుక్త సునీత, పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆదర్శ నేత అని 8వ వార్డు బీజేపీ అధ్యక్షుడు సీహెచ్ నాగరాజు అన్నారు. ముఖర్జీ బలిదాన దివస్ పురస్కరించుకుని వార్డులో పలుచోట్ల బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి. శ్రీనివాస్, సురేంద్రకుమార్, గరికిన ఎల్లాజీ, సత్యనారాయణ, అచ్యుతరావు, సీతారాం, పల్లవి మోహనరావు పాల్గొన్నారు.

ఆనందపురం : పెద్దిపాలెంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, ప్రసాదరావు పట్నాయక్, తదితరులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

'ప్రభుత్వ బడుల్లో చదివే వారికే అమ్మఒడి ఇవ్వాలి'

భీమునిపట్నం (రూరల్),జూన్ 23 : ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే అక్కడ చదివే విద్యార్థులకే అమ్మఒడి పథకాన్ని వర్తింపజేయాలని పీఆర్‌టీయూ (102) డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ సంఘం ప్రతినిధులు వర్మ, నరసింహమూర్తి, పట్నాయక్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల్ని చదివించే తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి బాగుంటుందని,వారికి ఏడాదికి రూ. 15 వేలు చెల్లించడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. చాలామంది తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తూ అమ్మఒడి ద్వారా అందుతున్న సొమ్మును ఫీజులుగా చెల్లిస్తున్నారని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి కొన్నిచోట్ల మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే అమ్మఒడి పథకాన్ని అక్కడ చదివే విద్యార్థులకు మాత్రమే అందించాలని కోరారు. అలాగే 1 నుంచి 5వ తరగతి వరకు మాతృభాషలోనే బోధన జరిగేలా చూడాలన్నారు.

అలరించిన హ్యాండ్‌బాల్ మ్యాచ్



ఏబీసీ పార్కులో హ్యాండ్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఎంవీపీ కాలనీ, జూన్ 23 : ప్రపంచ ఒలింపిక్ డే, హ్యాండ్‌బాల్ డే సందర్భంగా ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కులో ఆదివారం హ్యాండ్‌బాల్ మ్యాచ్ నిర్వహించారు. క్రీడాకారులు ముందుగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు.ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రాజారావు, సీనియర్ క్రీడాకారుడు పూసపాటి సత్యనారాయణరాజు, వి. గురుమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 45 ఏళ్ల కిందట ఎస్. అప్పారావు, బీఆర్ఎస్ రెడ్డి ఈ క్రీడను పరిచయం చేశారన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 20 మంది అంతర్జాతీయ పోటీల్లోనూ, వంద మంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. కాగా క్రీడాకారుల మ్యాచ్‌ను పరిసర ప్రాంతీయులు ఆసక్తిగా తిలకించారు.

నేడు గారిపేట మసీదులో చందనం సమర్పణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎండీ అహ్మద్

మధురవాడ, జూన్ 23 : జీవీఎంసీ ఆరో వార్డు శ్రీవల్లీనగర్‌లో హజరత్ ముక్తియార్ ఆలీ చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవం సోమ, మంగళవారం జరగనున్నట్టు ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎండీ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన శ్రీవల్లీనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ సంప్రదాయం ప్రకారం సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు భీమిలి క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న గారిపేట మసీదుకు మధురవాడ, మారికివలస, కొమ్మాది కూడలి మీదుగా ఊరేగింపుగా వెళ్లి చందనం సమర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం శ్రీవల్లీనగర్‌లో అన్నసమారాధన ఉంటుందన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందిస్తామన్నారు. అలాగే మధురవాడ పరిసరాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, అంగన్‌వాడీ పిల్లలకు కంచాలు, గ్లాసులు, గిన్నెలు పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు. 20 ఏళ్లగా ట్రస్టు తరపున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు వివరించారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ట్రస్టు సభ్యులు భాషా, సుభానీ, సుధీర్, తాజ్, జలాల్‌భాషా, సంతోష్ ఉన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్లో) స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, జూన్ 23 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణపుష్పార్చన, నిత్య కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసి నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతినామానికి ఒకటి చొప్పున స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

రెండు వీల్‌చైర్లు వితరణ

సింహాచలం, జూన్ 23 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే దివ్యాంగుల కోసం నగరానికి చెందిన (హెచ్ఎస్ఎల్ కాలనీ) వైజాగ్ మెడికల్ సిండికేట్ సభ్యులు రెండు వీల్‌చైర్లు వితరణగా అందజేశారు. ఆదివారం వాటిని సింహగిరిపై ప్రోటోకాల్ పర్యవేక్షణాధికారి సిరిపురపు కనకరాజుకు సభ్యులు అందజేశారు. ఇంతవరకు ఉన్న వీల్ చైర్లు నిర్వహణ లోపం వల్ల మరమ్మతుకు గురవ్వడంతో దాతలను దేవస్థానం అధికారులు అభ్యర్థించడంతో వీటిని ఇచ్చినట్టు తెలుస్తోంది. సిండికేట్ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

మొక్కలతో కాలుష్య నివారణ



జమ్మిచెరువు పార్కు ఆవరణలో మొక్కలు నాటుతున్న సభ్యులు

భీమునిపట్నం, జూన్ 23 : మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ సాధ్యమని వక్తలు అన్నారు. పిఠాపురం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ భీమిలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జమ్మిచెరువు పార్కు, సమీపంలోని వార్డు సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే పక్షులకు ఆహారంగా ధాన్యం కుచ్చులను పార్కులోని చెట్లకు వేలాడదీశారు. అనంతరం పార్కుకు వచ్చిన సందర్శకులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి, క్లాత్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ డాక్టర్ పింగళి ఆనందకుమార్, సభ్యులు పింగళి మంజుల, పి.వి. రామిరెడ్డి, ఎన్. రమాదేవి, కడిమిశెట్టి లక్ష్మి, శేషారత్నం, రవి, శ్యామ్, ఉషశ్రీ, ఉమాదేవి, చరణ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కుక్కల స్వైర విహారం

ద్వారకాకాంప్లెక్సు, జూన్ 23 : ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్సులో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బస్సుల కారిడార్, ప్రయాణికులు వేచి ఉండే స్థలాల్లో వీటి సంచారం అధికంగా ఉంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే కాంప్లెక్సులో కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

